www.epaper.asthramdaily.com
RNI : TGTEL/25/A1872

# సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక
సంగారెడ్డి- హైదరాబాద్

శనివారం,సెప్టెంబర్12,2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:195 | పేజీలు: 8 | వెల: రూ.5/-



తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..

## అనలాగ్ పన్నీర్‌పై నిషేధం

- ప్రజారోగ్యం దృష్ట్యా సర్కార్ కీలక నిర్ణయం
- తయారీ, అమ్మకాలపై ఏడాది పాటు నిషేధం విధింపు
- సెప్టెంబర్ 10 నుంచి అమల్లోకి వచ్చిన ఉత్తర్వులు



## విద్యే జీవితాన్ని మారుస్తుంది

ప్రత్యేక విద్యా కమిషన్ ఏర్పాటు చేశామని వెల్లడి

విద్యే జీవితాలను మార్చే శక్తి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చదువుకు దూరమైతే ఎంత ఆస్తి ఉన్నా సామాజికంగా వెనుకబడే పరిస్థితి ఉంటుందని చెప్పారు. 2024లో నిర్వహించిన సీపెక్ సర్వేలోనూ ఇదే విషయం వెల్లడైందన్నారు. అక్షరం ఒక్కటే మనిషి జీవితాన్ని ఉన్నత స్థాయికి తీసుకెళు ్తుందని స్పష్టం చేశారు. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా తెలంగాణ విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చుతున్నామని అసెంబ్లీలో తెలిపారు.రాష్ట్రంలో విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్దేందుకు ప్రత్యేక విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేశామని సీఎం చెప్పారు. ”

- విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమన్న సీఎం
- 28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులున్నట్లు వెల్లడి
- ఏడాదిలో 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చినట్లు ప్రకటన

హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)

జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా కొత్త మార్గదర్శకాలు రూపొందించేందుకు కేశవరావు కమిటీని నియమించినట్లు తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలోని 28,163 ప్రభుత్వ విద్యాసంస్థల్లో 28.77 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని వివరించారు. వీరికి 1.57 లక్షల మంది సిబ్బంది సేవలు అందిస్తున్నారని చెప్పారు. జెన్ జీతో పాటు జెన్ ఆల్ఫా, జెన్ బీటా తరాల భవిష్యత్తును తరగతి గదుల్లోనే తీర్చిదిద్దుతామని అన్నారు.ఉపాధ్యాయుల నియామకంలో తమ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని రేవంత్‌రెడ్డి తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్లలో 7,857 మంది టీచర్లను మాత్రమే నియమించిందని చెప్పారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 11 వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామని వెల్లడించారు. ఎలాంటి అవినీతికి అవకాశం లేకుండా 55 రోజుల్లో 10,600 మంది ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందించామని తెలిపారు. రైట్ టు ఎడ్యుకేషన్ ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉండాలి, తెలంగాణలో 17 మందికే ఒక ఉపాధ్యాయుడు ఉన్నారని వివరించారు.

హైదరాబాద్‌లో 13 రోజుల పాటు

## ట్రాఫిక్ ఆంక్షలు



- ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలు
- వినాయక చవితి సందర్భంగా ఖైరతాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు
- సెప్టెంబర్ 12 నుంచి 24వ తేదీ వరకు ఆంక్షలు అమలు
- ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు మళ్లింపులు

హైదరాబాద్,సెప్టెంబర్11 ,(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్‌లో వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో నగర ట్రాఫిక్ పోలీసులు కీలక ప్రకటన విడుదల చేశారు. ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12 నుంచి 24వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ఈ 13 రోజుల పాటు రోజూ ఉదయం 11 గంటల నుంచి భక్తుల రద్దీని బట్టి రాత్రి వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని స్పష్టం చేశారు.పోలీసులు ప్రకటన ప్రకారం, పాత సైఫాబాద్ పోలీస్ స్టేషన్ నుంచి బడా గణేష్ వైపు వచ్చే వాహనాలను ఇక్బాల్ మినార్ మీదుగా మళ్లిస్తారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.



కొండా సురేఖకు

## బుజ్జగింపులు

- మాజీ మంత్రి కొండా సురేఖకు ఫోన్ చేసిన మీనాక్షి నటరాజన్
- వ్యక్తిగత విభేదాలు పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచన
- అసెంబ్లీ సమావేశాలకు సురేఖ గైర్హాజరు కావడంతో పార్టీలో చర్చ
- అధిష్టానం ఆదేశాలతోనే ఇన్‌ఛార్జ్ మాట్లాడినట్లు సమాచారం
- తదుపరి సమావేశాలకు సురేఖ హాజరవుతారా అన్న దానిపై ఆసక్తి

హైదరాబాద్,సెప్టెంబర్11, (సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ మాజీ మంత్రి కొండా సురేఖకు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ ఫోన్ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో, సురేఖతో ఆమె నేరుగా సంభాషించినట్లు తెలియడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

ఇందిరమ్మ రాజ్యంలో

## గజానికో గజదొంగ

- రాష్ట్రంలో విపరీతంగా ల్యాండ్ చోరీ
- సీఎం బాగోతాలు బయటపెడతామనే.. సభ నుంచి గెంటేశారు
- 16 లక్షల ఎకరాల నుంచి 1.16 కోటి ఎకరాలు నిషేధిత జాబితాలోకి
- రూ. 200 కోట్ల విలువ చేసే భూములను రూ. 7 కోట్లకే కట్టబెట్టారు
- ప్రజలకు మానసిక ప్రశాంతత లేకుండా పోయింది
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)

ఇందిరమ్మ రాజ్యం(లో భూములు దోచుకుం టున్నారని, ఈ ప్రభుత్వం లో గజానికి ఒక గజ దొంగ ఉన్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్) ఆరోపించారు. రాష్ట్రంలో ల్యాండ్ చోరీ విపరీతంగా జరుగుతుంద ్నారు. రాష్ట్రం లో కోటి ఎకరాలను నిషేధిత జాబితా(లో ఈ ప్రభుత్వం పెట్టిందని, సీఎం రేవంత్‌రెడ్డి హారతి కర్పూరంలా భూములను కాజేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో ఇప్ప టివరకు జరగని మహా భూ కుంభకోణంఇది అని ఆయన అన్నారు.సీఎం బాగోతాలు బయటపడుతాయనే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సభ నుంచి సస్పెండ్ చేసి, మెడ పట్టి గెంటేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో 22 ఏ నిషేధిత జాబితా వ్యవహా రంపై మాజీ మంత్రి హరీశ్( పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ఇచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 2014లో రాష్ట్రంలో భూములు కొనాలంటే మానసిక అనుమానాలు అనేకం ఉండేవని, కేసీఆర్ సీఎం అయిన తరువాత రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులకు నీళ్లు ఇవ్వడంతో ఎకరం రూ. 5 లక్షలు ఉండే భూమి రూ. 50 లక్షలు అయిందని గుర్తు చేశారుబీఆర్ఎస్ హయంలో 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండేవని, ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత కోటి 16 లక్షల ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టారని విమర్శించారు. సీఎం బ్రదర్స్ భూములను కొల్లగొడుతున్నారని, మంత్రుల ముఠా అలీ బాబా అరడజన్ దొంగల్లా తయారు అయ్యారని ఎద్దేవా చేశారు. మంత్రుల వాటాల్లో భాగంగా మంత్రి పదవి నుంచి ఒకరిని బర్తరఫ్ చేశారని వెల్లడించారు. తమ్ముడు లెట్స్ దూ కుమ్ముడు అన్నట్టు సీఎం బ్రదర్స్ దోచుకుంటున్నారని మండిపడ్డారు.సమాంతర రెవెన్యూ వ్యవస్థ రాష్ట్రంలో జరుగుతుందని, అల్లుడు కోసం గిరిజన భూములను లాక్కునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. ఆర్‌టీఐని అడ్డంపెట్టుకొని రేవంత్ రెడ్డి బ్లాక్ మెయిల్ చేసేవారని, వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో, రేవంత్ రెడ్డి అనే బ్లాక్ మెయిలర్ సీఎం అయితే అలానే ఉందన్నారు. అత్తసొమ్ము అల్లుడికి దానం చేసినట్లు నగరం నడిబొడ్డున ఉన్న పారిశ్రామిక భూ ములను అమ్మేస్తున్నారని, రేవంత్ రెడ్డి అనుచరులకు నగరం నడిబొడ్డున ఉన్న భూములను కట్టబెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మూసీ సుందరీకరణ పేరుతో వేల ఎకరాలను అమ్ముకుంటున్నారని, ఫ్యూచర్ సిటీలో రూ. 200 కోట్ల విలువ చేసే భూవములను రూ. 7 కోట్లకే కట్టబెట్టారని ఆరోపించారు.

సినీ ప్రముఖులకు

## ఈసీ నోటీసులు

- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా పలువురు ప్రముఖులకు ఈసీ నోటీసులు
- హైదరాబాద్‌లో సమంత, విజయ్ దేవరకొండ, మహేశ్ బాబు, రాజమౌళి తదితరులు
- పేర్లలో తప్పులు, పాత రికార్డులతో వివరాలు సరిపోలకపోవడమే కారణం
- ఇది కేవలం పరిశీలనకేనని, ఓటు హక్కు రద్దు కాదని అధికారుల స్పష్టత




హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)

కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. వీరిలో హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ఉన్నట్లు సమాచారం.

ఎన్‌హెచ్‌ఆర్సీకి

## సబితాఇంద్రారెడ్డి ఫిర్యాదు

- అసెంబ్లీ ఘటనపై ఎన్‌హెచ్‌ఆర్సీకి ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్
- మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగారని ఆరోపణ
- ఇది కుట్రలో భాగమేనని సబితా ఇంద్రారెడ్డి వ్యాఖ్య
- డీజీపీకి ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని ఆవేదన



# విద్యే జీవితాన్ని మారుస్తుంది..

మొదటి పేజీ తరువాయి

విద్యా రంగానికి గతంలో తగ్గుతూ వచ్చిన బడ్జెట్ కేటాయింపులను తమ ప్రభుత్వం పెంచుతోందని సీఎం చెప్పారు. అసెంబ్లీ సభ్యులు ఇచ్చిన సూచనలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించి విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేస్తామని హామీ ఇచ్చారు. అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా తెలంగాణ విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యమన్నారు. దేశంలో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలకు పునాదులు వేసిన పండిట్ నెహ్రూ ఆలోచనలతో ముందుకు సాగుతామని తెలిపారు. భవిష్యత్ తరాలకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో 13 రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు

మొదటి పేజీ తరువాయి

ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు వెళ్లే వాహనాలు సచివాలయం ఎక్స్ రోడ్ మీదుగా ప్రయాణించాల్సి ఉంటుంది. అదేవిధంగా, నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను సచివాలయం జంక్షన్, ఖైరతాబాద్ ఫ్లైఓవర్ మీదుగా అనుమతిస్తారు. నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వచ్చే వాహనాలను పాత సైఫాబాద్ పీఎస్ జంక్షన్ మీదుగా మళ్లిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**భక్తులకు పార్కింగ్ సౌకర్యాలు:**

గణపతి దర్శనానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలను కేటాయించారు. రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ సమీపంలోని హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో వాహనాలను పార్క్ చేసుకోవచ్చు. ఖైరతాబాద్ జంక్షన్ నుంచి వచ్చే భక్తుల కోసం విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. వాహనదారులు రద్దీగా ఉండే మార్గాలకు బదులుగా ప్రత్యామ్నాయ రహదారులను ఎంచుకోవాలని పోలీసులు సూచించారు. అత్యవసర సహాయం కోసం 90102 03626 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.


భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ఖైరతాబాద్, షాదాన్ కాలేజ్, అయోధ్య, నిరంకారి, పాత పీఎస్ సైఫాబాద్, మింట్ కాంపౌండ్, ఎన్టీఆర్ మార్గ్, సెక్రటేరియట్ జంక్షన్, నెక్లెస్ రోటరీ, కేసీపీ జంక్షన్, మాసాబ్ ట్యాంక్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ ఏర్పడే అవకాశం ఉంది. ప్రయాణికులు ఈ మార్గాలకు దూరంగా ఉండాలని అధికారులు సూచించారు.

**భక్తుల వాహనాలకు పార్కింగ్ స్థలాలు..**

నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ గార్డెన్ వైపు నుంచి వచ్చే భక్తులు తమ వాహనాలను రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్, ఐమ్యాక్స్ థియేటర్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ పార్కింగ్ స్థలం, ఐమ్యాక్స్ థియేటర్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవచ్చని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. ఖైరతాబాద్ జంక్షన్ వైపు నుంచి వచ్చే భక్తులు తమ వాహనాలను విశ్వేశ్వరయ్య భవన్లో పార్కింగ్ చేసుకునేందుకు సదుపాయం కల్పించామన్నారు.

**ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలి..**

రద్దీ పరిస్థితులకు అనుగుణంగా ఆంక్షలు అమలవుతాయని, ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకుని నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ జాయింట్ సీపీ జోయల్ డేవిస్ కోరారు. ప్రయాణ వేళల్లో అత్యవసర సహాయం, ట్రాఫిక్ సమాచారం కోసం హెల్ప్లైన్ నంబర్ 90102 03626 ను సంప్రదించవచ్చని తెలియజేశారు.




# తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం..

# అనలాగ్ పన్నీర్‌పై నిషేధం

మొదటి పేజీ తరువాయి

ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా 'అనలాగ్' (కృత్రిమ) పన్నీర్‌పై నిషేధం విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిషేధం ఏడాది పాటు అమల్లో ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. పన్నీర్ పేరిట విక్రయిస్తున్న నాణ్యత లేని, కల్తీ ఉత్పత్తుల వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతున్న నేపథ్యంలో ఈ కఠిన చర్యలు చేపట్టింది. పన్నీర్ పేరుతో చలామణి అవుతున్న డైరీయేతర, కృత్రిమ ఉత్పత్తుల తయారీ, ప్రాసెసింగ్, ప్యాకింగ్, నిల్వ, రవాణా, పంపిణీ మరియు విక్రయాలపై ఈ నిషేధం వర్తిస్తుంది. ఈ మేరకు రాష్ట్ర ఆహార భద్రతా విభాగం (టీజీ సేఫ్) ఉత్తర్వులు జారీ చేసింది. 2026 సెప్టెంబర్ 10వ తేదీ నుంచి ఈ ఆదేశాలు రాష్ట్రవ్యాప్తంగా తక్షణమే అమల్లోకి వచ్చాయి. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ యాక్ట్, 2006లోని సెక్షన్ 30(2)(ఎ) ప్రకారం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ ఉత్తర్వులతో రాష్ట్రంలో కల్తీ పన్నీర్ తయారీ, విక్రయాలకు అడ్డుకట్ట పడనుంది.



# సినీ ప్రముఖులకు ఈసీ నోటీసులు

మొదటి పేజీ తరువాయి

కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన పలువురు సినీ, క్రీడా రంగాల ప్రముఖులకు నోటీసులు జారీ అయినట్లు తెలుస్తోంది. వీరిలో హీరోయిన్ సమంత, హీరో విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ వంటి వారు ఉన్నట్లు సమాచారం. ఓటర్ల జాబితాలోని వివరాల పరిశీలన నిమిత్తమే ఈ నోటీసులు జారీ చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ జాబితాలో నటుడు మహేశ్ బాబు, ఆయన భార్య నమ్రత, ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి, నటుడు వెంకటేశ్, ఆయన కుమార్తెలు, నటుడు ఆనంద్ దేవరకొండలతో పాటు క్రీడాకారులు సైనా నెహ్వాల్, మిథాలీ రాజ్, పుల్లెల గోపీచంద్ కూడా ఉన్నట్లు సమాచారం. ఫార్మా దిగ్గజం మురళీ కృష్ణ ప్రసాద్ దివి, మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ సతీమణి ఉపాసన కొణిదెల పేర్లు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలు ఉండటం, పాత రికార్డులతో ప్రస్తుత వివరాలు సరిపోలకపోవడం వంటి కారణాలతో ఈ నోటీసులు పంపినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కొన్ని సందర్భాల్లో నిర్దిష్టమైన కారణం ఏదీ పేర్కొనలేదని కూడా వార్తలు వస్తున్నాయి. నోటీసులు అందుకున్న వారు నేరుగా హాజరై తమ వివరాలను సరిచూసుకోవచ్చని లేదా అవసరమైన పత్రాలను సమర్పించి పొరపాట్లను సరిదిద్దుకోవచ్చని ఎన్నికల అధికారులు సూచిస్తున్నారు. ఒకవేళ వ్యక్తిగతంగా హాజరు కాలేని పక్షంలో తమ తరఫున ప్రతినిధులను పంపేందుకు కూడా అవకాశం కల్పించారు. అయితే, నోటీసు జారీ అయినంత మాత్రాన ఓటు హక్కు రద్దయినట్లు కాదని, ఇది కేవలం ధ్రువీకరణ ప్రక్రియలో ఒక భాగం మాత్రమేనని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రత్యేక సవరణ ప్రక్రియ దేశవ్యాప్తంగా సాగుతోంది. కర్ణాటకలోనూ ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని, జెరోధా వ్యవస్థాపకులు నితిన్, నిఖిల్ కామత్‌లకు కూడా ఇటువంటి నోటీసులే అందాయి. ఇదే క్రమంలో ప్రముఖ శాస్త్రవేత్త, భారతరత్న సీఎన్ఆర్ రావుకు కూడా నోటీసు జారీ అయిందన్న వార్తలను ఎన్నికల సంఘం ఖండించింది.

# ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీకి సబితాఇంద్రారెడ్డి ఫిర్యాదు

మొదటి పేజీ తరువాయి

తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణంలో తమపై జరిగిన దాడి జరిగిందని, అవమానకరకరమైన ప్రవర్తన ఎదురైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను (ఎన్‌హెచ్‌ఆర్సీ) ఆశ్రయించింది. బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నేతృత్వంలోని మహిళా ఎమ్మెల్యేల బృందం శుక్రవారం ఢిల్లీలో ఎన్‌హెచ్‌ఆర్సీ సభ్యురాలు విజయభారతిని కలిసి ఫిర్యాదును అందజేసింది. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అసెంబ్లీ వద్ద పోలీసులు తమ పట్ల అత్యంత అమానుషంగా ప్రవర్తించారని ఆరోపించారు. "మహిళా ఎమ్మెల్యేల జుట్టు పట్టుకుని లాగుతూ పోలీసులు అరాచకం సృష్టించారు. ఇదంతా ఒక పథకం ప్రకారం, కుట్రలో భాగంగానే జరిగింది" అని ఆమె పేర్కొన్నారు. తమను రక్షించేందుకు ప్రయత్నించిన తోటి ఎమ్మెల్యేలను సైతం పోలీసులు తోసివేసి కిందపడేసి తొక్కారని, ఈ ఘటనలో జగదీశ్‌రెడ్డికి రక్తపోటు పెరిగిందని, పలువురు ప్రజాప్రతినిధులకు గాయాలయ్యాయని వివరించారు. ఘటన జరిగి మూడు రోజులు గడుస్తున్నా, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర డీజీపీ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతోనే జాతీయ మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. అసెంబ్లీలోకి వెళ్లకుండా తమను అడ్డుకునే అధికారం పోలీసులకు ఎవరిచ్చారని ఆమె ప్రశ్నించారు. ఈ ఘటనపై తక్షణమే విచారణ జరిపి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు తమ ఫిర్యాదులో కోరారు.

# కొండా సురేఖకు బుజ్జగింపులు..

మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర రాజకీయాలు, పార్టీలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. వ్యక్తిగత అంశాలు, అంతర్గత విభేదాలను పక్కనపెట్టి పార్టీ కార్యక్రమాల్లో తిరిగి చురుగ్గా పాల్గొనాలని ఈ సందర్భంగా మీనాక్షి నటరాజన్.. కొండా సురేఖకు సూచించినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలుస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిఫార్సు మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించిన సంగతి తెలిసిందే. కేబినెట్ నుంచి తప్పించిన తర్వాత జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు సురేఖ గైర్హాజరు కావడం కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో, పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకే ఇన్‌ఛార్జ్ నేరుగా సురేఖతో మాట్లాడినట్లు సమాచారం. ఈ ఫోన్ కాల్ అనంతరం సురేఖ అసెంబ్లీ సమావేశాలకు హాజరవుతారా లేదా అన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

# ఇందిరమ్మ రాజ్యంలో గజానికో గజదొంగ

మొదటి పేజీ తరువాయి

ఎకరానికి రూ. 15 కోట్లకు ఇస్తామని, నూరు ఎకరాలు నిషేధిత జాబితాలో పెట్టారని చెప్పారు. అంతర్జాతీయ కంపెనీకి నేను లేఖ రాస్తానని, గతంలో నేను ఐటీ శాఖ మంత్రిగా పనిచేశానని చెప్పారు. అంతర్జాతీయ కంపెనీ వాళ్లను, బిల్డర్లను బెదిరించి కమిషన్‌లు వసూల్ చేస్తున్నారని ఆరోపించారు. కోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టడాన్ని రాహుల్ గాంధీకి తెలియజేస్తామని, సీఎంగా రెండేళ్లలో కేసీఆర్ వచ్చేది ఖాయమని ధీమా వ్యక్తంచేశారు. నిషేధిత జాబితాలో పెట్టిన భూములను కాపాడుకుందామని భరోసా ఇచ్చారు.

**33 జిల్లాల కలెక్టర్ల లేఖలు బయట పెడతాం..**

1908లో బ్రిటిష్ కాలంలో నిర్దిష్టమైన భూములను నిషేధించేందుకు 22-ఏ నిబంధన తీసుకొచ్చారని తెలిపారు. ప్రభుత్వ, పోరంబోకు భూములు, ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చిన అసైన్డ్ భూములు, దేవాదాయ, వక్ఫ్ భూములు, భూసీలింగ్ కింద ప్రభుత్వానికి సంక్రమించిన భూములను పరిరక్షించడమే దాని ఉద్దేశమని చెప్పారు. కానీ ఇప్పుడు గ్రామాలకు గ్రామాలు, కాలనీలు, అపార్ట్మెంట్లు, హౌసింగ్ సొసైటీలు, గతంలో ప్రభుత్వ సంస్థలు వేలం వేసిన భూములు కూడా నిషేధిత జాబితాలో చేర్చారని ఆరోపించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లోని హౌసింగ్ సొసైటీలు, షేక్‌పేట్ ప్రాంతం, అమీన్పూర్ తదితర ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 22-ఏ జాబితా తయారీకి సంబంధించి 33 జిల్లాల కలెక్టర్ల లేఖలను బయటపెడతామని ప్రకటించారు. 2025 సెప్టెంబర్ 11న కొత్త ప్రొహిబిషన్ లిస్ట్ తయారు చేయాలని ఆదేశాలు వచ్చాయని, నవంబర్‌లో కొన్ని జిల్లాల కలెక్టర్లు జాబితాలు రూపొందించారని, అనంతరం గెజిట్లు విడుదలయ్యాయని ఆరోపించారు. సిర్పూర్--కాగజ్‌నగర్ నియోజకవర్గంలో 30 వేల ఎకరాలను నిషేధిత జాబితాలో చేర్చారని, మంచిర్యాల నియోజకవర్గంలో 11 వేల ఇళ్లు ప్రభావితమ య్యాయని పేర్కొన్నారు. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో తనకు వేలాది దరఖాస్తులు వచ్చాయని, వాటిని అసెంబ్లీలో రెవెన్యూ మంత్రి ముందు పెట్టాలని భావించామని చెప్పారు. భూ భారతి పోర్టల్లో వక్ఫ్, దేవాదాయ భూములకు సంబంధించిన పూర్తి వివరాలు కనిపించడం లేదని ఆరోపించారు. ప్రభుత్వానికి సం బంధించిన భూముల వివరాలు అందుబాటులో లేకపోయినా, ప్రజల భూములను మాత్రం నిషేధిత జాబితాలో చేర్చారని విమర్శించారు. ఈ వ్యవహారంలో అధి కారులపై ఒత్తిడి తెచ్చి జాబితాలు తయారు చేయించారని ఆరోపించారు. 'తప్పు 33జిల్లాల కలెక్టర్లదేనా? ప్రభుత్వ ఆదేశం లేకుం డానే ఇంత పెద్దఎత్తున భూములను 22-ఏలో చేర్చారా? అధికారులు తప్పుచేస్తే ఎందుకు చర్యలు తీసుకోలేదు?' అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి నివాసం కూడా 22 -ఏ జాబితాలో చేరిందని, ఈ విషయం బయటకు వచ్చిన తర్వాత రాత్రికి రాత్రే దానిని జాబితా నుంచి తొలగించారని ఆరోపించారు. 'ముఖ్యమంత్రి ఇల్లు 22-ఏలో ఉంటే తొలగించగలిగారు. మరి సామాన్యుల భూములను ఎందుకు తొలగించలేరు?' అని ప్రశ్నించారు. ప్రభుత్వం చేసిన తప్పుకు ప్రజలు ఎందుకు శిక్ష అనుభవించాలని నిలదీశారు. నిషేధిత జాబితాలో చేర్చిన భూములను ప్రభుత్వం స్వయంగా తొలగించాలని, బాధితులను కార్యాలయాల చుట్టూ తిప్పకూడదని డిమాండ్ చేశారు. భూముల వివరాలు, చేర్చినవి, తొలగించినవి, తొలగింపునకు కారణాలు అన్నింటినీ ప్రజలకు బహిరంగంగా వెల్లడించాలని కోరారు. 22-ఏ వ్యవహారంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. 'చీమూ నెత్తురు, సిగ్గు ఉంటే పొంగులేటి వెంటనే రాజీనామా చేయాలి. నైతికత ఉంటే పదవిలో కొనసాగకూడదు' అన్నారు. తాను చేసిన తప్పును అధికారులపైకి నెట్టేసి ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. నాదర్‌గుల్‌లో 373 ఎకరాల ప్రభుత్వ భూమి ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో ఉందని ఆరోపించారు. ఈ వ్యవహారంలో రెవెన్యూ మంత్రి కుటుంబానికి సంబంధించిన వ్యక్తులపై ఆయన పలు ఆరోపణలు చేశారు. ఆ భూమి ప్రభుత్వానిదేనని సంబంధిత న్యాయపరమైన ప్రక్రియల్లో వెల్లడైందని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పసుమాముల, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లోనూ భూముల వ్యవహారాలపై ఆరోపణలు చేశారు. భూ భారతి పేరుతో భూ వ్యవహారాల్లో అక్రమాలు జరుగుతున్నాయని విమర్శించారు. 22-ఏ భూముల వ్యవహారంపై ఆధారాలను అసెంబ్లీలో బయటపెట్టేందుకు సిద్ధమయ్యామని, అందుకే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేశారని మండిపడ్డారు. బాధితుల నుంచి వచ్చిన వేలాది దరఖాస్తులను సభలో పెట్టి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలనుకున్నామని చెప్పారు. 'మమ్మల్ని అసెంబ్లీకి రాకుండా చేసినా వదిలిపెట్టం. అరెస్టు చేసినా వెనక్కి తగ్గం. బాధితుల పక్షాన బీఆర్ఎస్ పోరాటం చేస్తుంది' అని స్పష్టం చేశారు. 22-ఏలో చేర్చిన భూములపై బేషరతుగా నిషేధం తొలగించాలని, మొత్తం వ్యవహారంపై జ్యుడిషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 'మీకు రియల్ ఎస్టేట్ తెలుసు.. మాకు పోరాటాలు తెలుసు. సర్కారు మెడలు వంచి 22-ఏను తొలగించే వరకు పోరాటం ఆగదు' అని హెచ్చరించారు.

**ఆయా జిల్లాల నుంచి బాధితులు..**

తెలంగాణ భవన్‌లో 22 ఏ వ్యవహారంపై హరీశ్‌రావు ప్రజెంటేషన్ సందర్భంగా ఆయా జిల్లాల నుంచి బాధితులు తరలివచ్చారు. బాధితులు తమ భూములు నిషేధిత జాబితాలో చేరడంతో ఎదుర్కొంటున్న ఇబ్బందులను కేటీఆర్, హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి తమ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎలాంటి ఇబ్బందులు లేవని, కాంగ్రెస్ రాగానే మా భూములు కబ్జా పెట్టారని బాధపడ్డారు. తమకు అండగా ఉండాలంటూ బీఆర్ఎస్ పార్టీని కోరారు. తెలంగాణ భవన్‌కు వచ్చిన వారిలో ఇస్రో సైంటిస్ట్ హను మంతరావు, కూకట్‌పల్లి నుంచి కృష్ణారెడ్డి, ఎల్బీ నగర్ నుంచి సీతారాంరెడ్డి, గోపాల్‌రావు, కుత్బుల్లాపూర్ నుంచి బాలరాజు, సత్తిరెడ్డి, పటాన్‌చెరు నుంచి విజయ్‌రాజ్, సంజీవరెడ్డి, దాసు, ఆసిఫాబాద్ నుంచి మల్లేశ్, జయరాం, కరీంనగర్ నుంచి మోహన్‌రెడ్డి, రాజశేఖర్, యాదాద్రి భువనగిరి నుంచి రామనర్సయ్య, నీలం ఓం ప్రకాశ్‌రావు, మంచిర్యాల నుంచి సురేందర్‌రెడ్డి, ఫిర్జాదీగూడ నుంచి ఆకుల సత్యనారాయణ, ఈసీఐఎల్ నుంచి సోమశేఖర్‌రెడ్డి కాగజ్‌నగర్ నుంచి భీంబాయి, విజయలక్ష్మీ, రాం దాస్‌పల్లి నుంచి శ్రీనివాస్, ప్రకాశ్, తుర్కంజాయల్‌నుంచి సురేందర్‌రెడ్డి, రాంనగర్ నుంచి వెంకటేశ్వర్‌రావు ఉన్నారు.

**పొంగులేటి రాజీనామా చేయాలి..**

రాష్ట్రంలో 22-ఏ నిషేధిత జాబితా వెనుక భారీ భూదందా, రాజకీయ కుట్ర ఉందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర జ్యుడిషియల్ విచారణ జరిపిం చాలని డిమాండ్ చేశారు. నైతికత ఉంటే రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. 22-ఏ వ్యవహారంలో సీఎం రేవంత్‌రెడ్డికి కూడా సంబంధం ఉందని, ఏ1 రేవంత్‌రెడ్డి, ఏ2 పొంగులేటి అని ఆరోపించారు. 22ఏ నిషేధిత జాబితా భూముల అంశంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'నిన్నటి వరకు అది మీ భూమి.. తెల్లారేసరికి నిషేధిత భూమిగా మారింది.

# ఓటర్ల జాబితాలో తప్పులకు తావొద్దు!..

## శేరిలింగంపల్లిలో సీఈఓ సుదర్శన్ రెడ్డి ఆకస్మిక పరిశీలన

- సర్ --2026 ప్రక్రియ పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించిన రాష్ట్ర సీఈఓ
- సవరణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు
- పారదర్శకత, ఖచ్చితత్వమే ప్రామాణికంగా పని చేయాలని సూచన



**సామాన్యుడి అస్త్రం / శేరిలింగంపల్లి:**

ఓటర్ల జాబితా సవరణలో చిన్న పొరపాటుకు కూడా తావివ్వొద్దని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ రెడ్డి, ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటర్ల జాబితా తీవ్ర సవరణ--- సర్ --2026 ప్రక్రియను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఇప్పటివరకు జరిగిన పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా శేరిలింగంపల్లి ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, ఐఏఎస్ సీఈఓ వెంట ఉండి నియోజకవర్గంలో కొనసాగుతున్న ఓటర్ల వివరాల సేకరణ, ధ్రువీకరణ, సవరణ కార్యక్రమాల గురించి వివరించారు. క్షేత్రస్థాయి సిబ్బంది చేపడుతున్న ఇంటింటి పరిశీలనతోపాటు దరఖాస్తుల స్వీకరణ, వివరాల నమోదు ప్రక్రియపై సుదర్శన్ రెడ్డి ఆరా తీశారు.ఓటర్ల జాబితా సవరణ పనులు నత్తనడకన సాగకుండా మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటంతోపాటు అనర్హులు, మృతులు, చిరునామా మారిన వ్యక్తులకు సంబంధించిన వివరాలను ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారమే పరిశీలించాలని స్పష్టం చేశారు.సవరణ ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం అత్యంత కీలకమని సీఈఓ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన నుంచి తుది జాబితా రూపకల్పన వరకు ప్రతి దశను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, నమోదు చేసే ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా ధ్రువీకరించాలని అధికారులను ఆదేశించారు. తొందరపాటుతో తప్పులు చోటుచేసుకుంటే అర్హులైన ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు.సర్ --2026 ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ, నిర్ణీత గడువులో క్రమబద్ధంగా పూర్తి చేయాలని సూచించారు. సిబ్బందికి ఎదురవుతున్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి, దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే అభ్యంతరాలు, వినతులను నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని పేర్కొన్నారు.ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం లేకుండా సవరణ ప్రక్రియను పూర్తి చేసినప్పుడే తాజా, నమ్మకమైన ఓటర్ల జాబితా సిద్ధమవుతుందని సీఈఓ స్పష్టం చేశారు. ఉన్నతాధికారుల క్షేత్రస్థాయి పర్యటనతో శేరిలింగంపల్లిలో సర్ 2026 పనులు మరింత వేగం పుంజుకునే అవకాశం కనిపిస్తోంది.

# 241లో గులాబీ టికెట్ పోరు..

## కాసాని శ్రీధర్ వైపే స్థానికుల చూపు!



- బీఆర్ఎస్ టికెట్ ఆశావహుల జాబితాలో ప్రముఖంగా వినిపిస్తున్న శ్రీధర్ పేరు
- మక్తా మహబూబ్‌పేట్ లో యువత, స్థానికులతో బలమైన అనుబంధం
- కుటుంబ రాజకీయ నేపథ్యం కూడా కలిసొస్తుందంటున్న అనుచరులు


**సామాన్యుడి అస్త్రం / మియాపూర్ :**

జీహెచ్ఎంసీ ఎన్నికలకు ఇంకా అధికారిక నగారా మోగకముందే డివిజన్ 241లో రాజకీయ వేడి మొదలైంది. ప్రధాన పార్టీల నుంచి టికెట్ ఆశిస్తున్న నాయకులు క్షేత్రస్థాయిలో తమ బలాన్ని చాటుకునే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ కార్పొరేటర్ అభ్యర్థిత్వం కోసం ప్రయత్నిస్తున్న వారిలో కాసాని శ్రీధర్ ముదిరాజ్ పేరు ముందువరుసలో వినిపిస్తోంది.మక్తా--మహబూబ్‌పట్నం పరిధిలో శ్రీధర్‌కు స్థానిక ప్రజలతో ఉన్న పరిచయాలు, యువతతో కొనసాగిస్తున్న సన్నిహిత సంబంధాలు ఆయనకు రాజకీయంగా బలంగా మారుతున్నాయని అనుచరులు చెబుతున్నారు. ప్రజా సమస్యలపై స్పందించడం, సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం, అవసరమైన సమయంలో స్థానికులకు అందుబాటులో ఉండటం వల్ల ఆయనకు ప్రత్యేక గుర్తింపు ఏర్పడిందని పేర్కొంటున్నారు.శ్రీధర్ కుటుంబానికి ఉన్న రాజకీయ నేపథ్యం కూడా టికెట్ రేసులో ఆయనకు కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది. ఆయన తండ్రి కాసాని రామాంజనేయులు గతంలో ఉపసర్పంచ్‌గా పనిచేసి స్థానిక ప్రజలకు సేవలందించారు. అదేవిధంగా చేవెళ్ల పార్లమెంట్ పరిధి రాజకీయాల్లో కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు ఉన్న గుర్తింపు, కుటుంబానికి ప్రజలతో కొనసాగుతున్న అనుబంధం శ్రీధర్ అభ్యర్థిత్వానికి అదనపు బలాన్నిస్తోందని ఆయన వర్గీయులు అభిప్రాయపడుతున్నారు.డివిజన్ 241లో బీఆర్ఎస్‌ను క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడంతోపాటు స్థానికంగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించగల అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని పార్టీ శ్రేణులు కోరుతున్నాయి. మౌలిక వసతుల అభివృద్ధి, రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం వంటి సమస్యలపై స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్లగల నాయకత్వం అవసరమని స్థానికులు అంటున్నారు.టికెట్ లభిస్తే ప్రజల ఆశీస్సులతో విజయం సాధించి డివిజన్ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తామని శ్రీధర్ అనుచరులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కారం కోసం పోరాడటమే తమ లక్ష్యమని చెబుతున్నారు.అయితే డివిజన్ 241 బీఆర్ఎస్ టికెట్ కోసం మరికొందరు ఆశావహులు కూడా ప్రయత్నాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో అభ్యర్థి ఎంపిక పార్టీ అధిష్ఠానానికి కీలక పరీక్షగా మారనుంది. ప్రస్తుతానికి కాసాని శ్రీధర్ ముదిరాజ్ పేరు బలంగా వినిపిస్తున్నప్పటికీ, చివరకు గులాబీ బాస్ ఆశీస్సులు ఎవరికి దక్కుతాయన్నది స్థానిక రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతోంది.

# బలవంతపు వసూళ్లకు పాల్పడితే కేసులే!..

## ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు మాధాపూర్ పోలీసుల కౌన్సెలింగ్

- ప్రజలను బెదిరించి డబ్బులు వసూలు చేయొద్దని స్పష్టమైన హెచ్చరిక
- బహిరంగ ప్రదేశాల్లో అసభ్య ప్రవర్తనతో ఇబ్బందులు కలిగించవద్దని సూచన
- సమస్యలుంటే నేరుగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని భరోసా



**సామాన్యుడి అస్త్రం / మాధాపూర్:**

ప్రజలను బెదిరించడం,దా ఒత్తిడి చేసి డబ్బులు వసూలు చేయడం వంటి చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని మాధాపూర్ పోలీసులు హెచ్చరించారు. మాధాపూర్ పోలీస్ స్టేషన్‌లో పలువురు ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు ఎస్‌హెచ్‌వో, సబ్ ఇన్‌స్పెక్టర్లు కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా బహిరంగ ప్రదేశాలు, ప్రధాన రహదారులు, ట్రాఫిక్ కూడళ్లు, వాణిజ్య ప్రాంతాల్లో ప్రజలను బలవంతపెట్టి డబ్బులు అడగడం లేదా వసూలు చేయడం చట్టవిరుద్ధమని పోలీసులు స్పష్టం చేశారు. ప్రజలకు అసౌకర్యం కలిగించేలా అసభ్యంగా ప్రవర్తించడం, అభ్యంతరకర చర్యలకు పాల్పడటం సహించబోమని హెచ్చరించారు.ప్రజల నుంచి ఫిర్యాదులు అందినా, పోలీసుల తనిఖీల్లో ఎవరైనా ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నట్లు గుర్తించినా చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యక్తుల ప్రవర్తన ఆధారంగానే చర్యలు ఉంటాయని, ఒక వర్గం మొత్తాన్ని లక్ష్యంగా చేసుకోవడం ఈ కౌన్సెలింగ్ ఉద్దేశం కాదని పోలీసులు స్పష్టం చేశారు.ట్రాన్స్‌జెండర్ వ్యక్తులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. వేధింపులు, వివక్ష, జీవనోపాధికి సంబంధించిన ఇబ్బందులు లేదా ఇతర సమస్యలపై పోలీస్ స్టేషన్‌ను సంప్రదిస్తే నిబంధనల ప్రకారం స్పందిస్తామని భరోసా ఇచ్చారు.ప్రజల గౌరవానికి, భద్రతకు భంగం కలగకుండా ప్రతి ఒక్కరూ చట్టపరిధిలో వ్యవహరించాలని మాధాపూర్ పోలీసులు కోరారు. పరస్పర గౌరవంతో మెలగడం ద్వారా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కౌన్సెలింగ్‌లో సూచించారు.

# ట్రాఫిక్ జామ్‌కు

# చెక్ పెట్టండి!..



- ఆర్సీపురం--కేపీహెచ్‌బీలో జేసీపీ క్షేత్రస్థాయి తనిఖీలు
- లింగంపల్లి ఆర్‌యూబీ, ఫ్లైఓవర్, ఎన్‌హెచ్--65 పనులపై ప్రత్యేక సమీక్ష
- రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ, బస్సు సౌకర్యాలపై ఆరా
- ప్రగతినగర్, రెమెడీ యూ--టర్న్‌ల వద్ద ట్రాఫిక్ సమస్యల పరిశీలన

**సామాన్యుడి అస్త్రం / సైబరాబాద్:**

నిత్యం వాహనాల రద్దీతో సతమతమవుతున్న ఆర్సీపురం, లింగంపల్లి, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని సైబరాబాద్ ట్రాఫిక్ సంయుక్త పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ కాగితాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితం కనిపించాలని స్పష్టం చేశారు.సన్‌ప్రీత్ సింగ్ సెప్టెంబర్ 11న ఉదయం సుమారు 11:30 గంటలకు ఆర్సీపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్ పనితీరు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, నిబంధనల అమలు తీరును సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్--2 డీసీపీ శేషాద్రిని రెడ్డి, ఐపీఎస్, అదనపు డీసీపీ ఎ.వీరన్న, ఆర్సీపురం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోతోపాటు ఇతర పోలీసు సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.ట్రాఫిక్ పోలీసు సిబ్బంది రోజువారీగా నిర్వహిస్తున్న విధులు, ప్రధాన కూడళ్లు, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చేపడుతున్న నియంత్రణ చర్యల గురించి జేసీపీ అడిగి తెలుసుకున్నారు. 2025, 2026 సంవత్సరాలకు సంబంధించిన ట్రాఫిక్ నిబంధనల అమలు గణాంకాలను పరిశీలించి, రెండు సంవత్సరాల పనితీరును పోల్చి చూశారు. నిబంధనల ఉల్లంఘనలను నియంత్రించడంతోపాటు రహదారి భద్రతను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అభివృద్ధి పనులతో వాహనదారులకు ఇబ్బందులు రాకూడదు**

ఆర్సీపురం పరిధిలో కొనసాగుతున్న రహదారి అభివృద్ధి పనులపై జేసీపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి, ఫ్లైఓవర్ పనులతోపాటు ఎన్‌హెచ్--65 రహదారి అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. నిర్మాణ పనులు జరిగే ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు ఆటంకం ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.ప్రత్యామ్నాయ మార్గాలు, హెచ్చరిక బోర్డులు, బారికేడ్ల ఏర్పాటు విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. పనుల కారణంగా వాహనదారులు గంటల తరబడి రోడ్లపై నిలిచిపోకుండా సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని స్పష్టం చేశారు.

**లింగంపల్లి రైల్వేస్టేషన్ వద్ద రద్దీపై ఆరా**

అనంతరం లింగంపల్లి రైల్వేస్టేషన్‌ను సందర్శించిన జేసీపీ, స్టేషన్ పరిసరాల్లో వాహనాల రాకపోకలను పరిశీలించారు. రైల్వేస్టేషన్ నుంచి చుట్టుపక్కల ప్రాంతాలకు అందుబాటులో ఉన్న బస్సు సౌకర్యాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.స్టేషన్ మీదుగా రోజువారీగా రాకపోకలు సాగించే రైళ్ల సంఖ్య, ఉదయం--సాయంత్రం రద్దీ వేళల్లో రైళ్లు ఎక్కే, దిగే ప్రయాణికుల సంఖ్యపై సమాచారం సేకరించారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఆటోలు, బస్సులు, ప్రైవేటు వాహనాల నిలుపుదలను క్రమబద్ధీకరించి, స్టేషన్ ప్రవేశ మార్గాల్లో ట్రాఫిక్ నిలిచిపోకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

**ప్రగతినగర్, రెమెడీ యూ--టర్న్‌ల వద్ద తనిఖీ**

తర్వాత కేపీహెచ్‌బీ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన ట్రాఫిక్ ప్రాంతాలను జేసీపీ సందర్శించారు. ప్రగతినగర్ యూ--టర్న్, రెమెడీ యూ--టర్న్‌ల వద్ద వాహనాల రాకపోకలు, రద్దీ సమయాల్లో ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్యలను స్వయంగా పరిశీలించారు.రద్దీ ఎక్కువగా ఉండే వేళల్లో అవసరమైన సంఖ్యలో సిబ్బందిని మోహరించి, వాహనాలు నిలిచిపోకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తరచూ ఏర్పడే ప్రాంతాలను ముందుగానే గుర్తించి, రద్దీ తీవ్రమయ్యే వరకు వేచి చూడకుండా తక్షణ నియంత్రణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.వాహనదారులకు సాఫీగా, నిరంతరాయంగా ప్రయాణించే పరిస్థితులు కల్పించడంతోపాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రాధాన్యం ఇవ్వాలని జేసీపీ సూచించారు. ప్రధాన కూడళ్లు, యూ--టర్న్‌లు, నిర్మాణ పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో సిబ్బంది మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు.

# హైదరాబాద్‌లో ఆస్తి కొంటున్నారా?

**హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)**

హైదరాబాద్ పౌరులకు కీలక సమాచారాన్ని ఒకే వేదికపై అందించే దిశగా హైడ్రా కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా శుక్రవారం తన అధికారిక వెబ్‌సైట్/పోర్టల్‌ను ప్రారంభించింది. ఏజెన్సీ కమిషనర్ ఏ.వి. రంగనాథ్ ఈ పోర్టల్‌ను ఆవిష్కరించారు. చెరువులు, వరదలు, భూ రికార్డుల వంటి పలు ముఖ్యమైన సేవలను ఈ పోర్టల్ ద్వారా ప్రజలు సులభంగా పొందవచ్చు.ఈ పోర్టల్ ద్వారా ముఖ్యంగా ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసే వారికి ఎంతో ప్రయోజనం చేకూరనుంది. చెరువులు, ఇతర నీటి వనరుల సమీపంలో ఆస్తులను కొనుగోలు చేసే ముందు వాటి పూర్తిస్థాయి నీటిమట్టం (ఫ్టీూ), బఫర్ జోన్ వివరాలను దీని ద్వారా ధ్రువీకరించుకోవచ్చు. ఇందుకోసం హెచ్ఎండీఏ లేక్స్ పోర్టల్‌కు నేరుగా యాక్సెస్ కల్పించారు. అలాగే జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలోని వరద, నీటి ముంపు ప్రాంతాల ప్రత్యేక మ్యాపులను కూడా ఇందులో పొందుపరిచారు.వీటితో పాటు వాతావరణ సమాచారం, వర్షపాతం వివరాలు, హైదరాబాద్ డాప్లర్ రాడార్ సమాచారం కూడా అందుబాటులో ఉంటాయి.

## పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు..

# అసెంబ్లీలో కీలక బిల్లుకు ఆమోదం

**మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం**
**తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం**
**హైదరాబాద్ వెలుపల 9 కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌కు ప్రాతినిధ్యం**
**ప్రజా జీవితంలో భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యమన్న ప్రభుత్వం**
**బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ, సీపీఐ సభ్యులు**



హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరిపాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. దీని ప్రకారం, హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్) వెలుపల ఉన్న తొమ్మిది మున్సిపల్ కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌ను నామినేటెడ్ సభ్యునిగా కో-ఆప్ట్ చేసుకునే అవకాశం కలుగుతుంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, సామాజిక వివక్ష, వెలికి గురవుతున్న ట్రాన్స్‌జెండర్లను ప్రధాన స్రవంతిలోకి తీసుకురావడంతో పాటు, ప్రజా జీవితంలో వారి భాగస్వామ్యాన్ని పెంపొందించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.

# మోదీ 25 ఏళ్ల సేవకు సేవా సంకల్ప్



**17 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు**
**'ఆశీర్వాద్ కా దియా'తో శ్రీకారం**
**లబ్ధిదారులు ఇండ్లలో దీపాలు**
**స్వచ్ఛ భారత్, 'మేరే సప్నో కా భారత్', రక్తదాన శిబిరాలు**
**బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడి**

హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)

ప్రధాని నరేంద్రమోదీ(ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా 25 ఏళ్ల పాటు నిరంతరాయంగా దేశానికి అందించిన విశిష్ట సేవలను పురస్కరించుకుని జాతీయ స్థాయిలో నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు( వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వేముల అశోక్, వీరేందర్‌గౌడ్, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మాధ వి, మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శి ల్పారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ప ల్నాటి వెంకట్ రెడ్డి, మాజీ శాసనసభ్యులు గువ్వల బాలరాజుతో కలిసి ఆయన మాట్లాడారు. 2001 అక్టోబర్ 7న గుజరాత్ ము ఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన మోదీ.. 12.5 ఏళ్లు సీఎంగా, 12.5 ఏళ్లు ప్రధానమంత్రిగా మొత్తం 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవను పూర్తి చేసుకుంటారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య చరిత్రలోనే ఇది అరుదైన మైలురాయి అని కొనియాడారు. బీజేపీ జాతీయ నా యకత్వ ఆదేశాల మేరకు ఈనెల 17న మోదీ జన్మదినం నుంచి అక్టోబర్ 17 వరకు దేశవ్యాప్తంగా సేవా సంకల్ప్ అభియాన్ చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల 17న తెలంగాణ విమోచన దినోత్సవం కూడా ఉన్నందున, ఆ రోజు సాయంత్రం హైదరాబాద్‌లో 'ఆశీర్వాద్ కా దియా'తో సేవా సంకల్ప్ అభి యాన్ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నట్లు రాంచందర్‌రావు వెల్లడించారు.

# మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ..



**మూసీ ప్రాజెక్టుపై ఎన్జీటీలో కొత్త పిటిషన్**
**తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ**
**పర్యావరణ అనుమతులపై రిటైర్డ్ ఇంజినీర్ల అభ్యంతరాలు**
**55 కి.మీ.లో 20 కి.మీ. అధ్యయనంపై ప్రశ్నలు**
**ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ నిర్మాణాలపై అభ్యంతరం**

హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మరోసారి న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్' (ఎన్జీటీ) దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. మూసీ ప్రక్షాళన పనులకు సంబంధించి పర్యావరణ నిబంధనలు, అనుమతుల్లో లోపాలు ఉన్నాయని పిటిషనర్లు ఆరోపించారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కిలోమీటర్లు ఉంటే.. కేవలం 20 కిలోమీటర్ల మేర మాత్రమే అధ్యయనం చేశారని పేర్కొన్నారు. ఇదే ప్రాంతంలో మృగవాణి జాతీయ పార్కు కూడా ఉందని తెలిపారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ పరిసరాల్లో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న ప్రభుత్వ నిర్ణయంపైనా రిటైర్డ్ ఇంజినీర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా అభ్యంతరాలు లేవనెత్తారు. ప్రాజెక్టు వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పిటిషనర్లు వాదించారు. పిటిషన్‌ను పరిశీలించిన ఎన్జీటీ.. ప్రతివాదిగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు ఇచ్చింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన వివరాలను ట్రిబ్యునల్‌కు సమర్పించాలని ఆదేశించింది. ఈ అంశంపై ప్రభుత్వం తన వాదనను కూడా వెల్లడించాల్సి ఉంది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేసింది. ఇప్పుడు మరో పిటిషన్ దాఖలు కావడంతో ఈ వ్యవహారం మళ్లీ చర్చనీయాంశంగా మారింది. రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై తదుపరి విచారణను ఎన్జీటీ అక్టోబర్ 16కు వాయిదా వేసింది. ఆ విచారణలో పిటిషనర్లు లేవనెత్తిన పర్యావరణ అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు కీలకం కానున్నాయి. ఇప్పటికే మూసీ ప్రక్షాళనను ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో ఎన్జీటీలో తాజా పరిణామం రాజకీయంగానూ ప్రాధాన్యం సంతరించుకుంది.

# ఆర్మీ వెపన్స్ చోరీ కేసులో షాకింగ్ ట్విస్ట్..



**పాక్ ఆయుధ డీలర్‌తో మల్లేశ్‌కు సంబంధాలున్నాయా?**
**బొల్లారం ఆర్మీ వెపన్స్ చోరీపై దర్యాప్తు వేగం**
**హవాల్దార్ మల్లేశ్ సోషల్ మీడియాపై పోలీసుల దృష్టి**
**పాక్ ఆయుధ డీలర్‌ను మల్లేశ్ ఫాలో అయినట్లు గుర్తింపు**
**డీలర్ ఖాతాలో ఏకే-47, షాట్‌గన్ వీడియోలు**
**ఆయుధాల విక్రయ కోణంలోనూ దర్యాప్తు**

హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)

బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆర్మీ వెపన్స్ చోరీ కేసులో దర్యాప్తు కొలిక్కి వస్తున్న కొద్దీ కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న హవాల్దార్ మల్లేశ్‌కు పాకిస్థాన్‌కు చెందిన ఆయుధ డీలర్లతో సంబంధాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మల్లేశ్ సోషల్ మీడియా ఖాతాలను పరిశీలించిన అధికారులకు పలు అనుమానాస్పద అంశాలు కనిపించినట్లు సమాచారం. అతడు ఇన్‌స్టాగ్రామ్‌లో పాకిస్థాన్‌కు చెందిన ఓ ఆయుధ డీలర్‌ను ఫాలో అవుతున్నట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది. సదరు పాక్ డీలర్ తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో వివిధ రకాల షాట్‌గన్స్, ఏకే-47 తుపాకులకు సంబంధించిన వీడియోలను పోస్టు చేసినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించినట్లు సమాచారం. దీంతో మల్లేశ్ ఆ ఖాతాను ఎందుకు ఫాలో అయ్యాడు? అతడికి ఆ డీలర్‌తో ఏమైనా ప్రత్యక్ష సంబంధాలున్నాయా? అనే అంశాలపై పోలీసులు దృష్టి సారించారు. దొంగిలించిన సైనిక ఆయుధాలను విదేశీ ఆయుధ డీలర్లకు లేదా అక్రమ ఆయుధ ముఠాలకు విక్రయించాలనే ఉద్దేశంతోనే మల్లేశ్ చోరీకి పాల్పడ్డాడా? అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. అయితే పాక్ డీలర్‌తో మల్లేశ్‌కు వాస్తవంగా సంబంధాలు ఉన్నాయా? అన్నది ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. మల్లేశ్ ఉపయోగించిన సోషల్ మీడియా ఖాతాలన్నింటినీ అధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. డిజిటల్ ఆధారాలు, ఆన్‌లైన్ పరిచయాలు, ఇతర కార్యకలాపాలను విశ్లేషిస్తున్నారు. దేశ భద్రతకు సంబంధించిన వ్యవహారం కావడంతో ఆయుధాల చోరీ వెనుక మరెవరైనా ఉన్నారా? ఏదైనా పెద్ద నెట్‌వర్క్ పనిచేస్తోందా? అనే అంశాలపై కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

# బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ..
# నలుగురు నిందితుల అరెస్ట్: సీవీ ఆనంద్ సంచలన వివరాలు

**ఆగస్ట్ 31న బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో ఆయుధాల చోరీ**
**ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్మ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ ల సహకారం**
**28, 29 తేదీల్లో రెక్కీ నిర్వహించిన మల్లేశ్**



హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)

హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్మ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉన్న ఈ ప్రమాదకర ఆయుధాల చోరీని సత్వరమే ఛేదించిన మిలిటరీ అధికారులను, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను, దర్యాప్తు బృందాలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

# డ్రోన్లతో వైద్యం, వ్యర్థాలతో సంపద..
# ఏపీ కలెక్టర్ల బెస్ట్ ఐడియాలు!

**8వ కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో ఉత్తమ పాలనా విధానాలపై ప్రజెంటేషన్లు**
**అల్లూరి జిల్లాలో డ్రోన్లతో మారుమూల ప్రాంతాలకు వైద్య సేవలు**
**చిత్తూరులో డిజిటల్ విద్య, బాపట్లలో ఆటిజం విద్యార్థులకు ప్రత్యేక స్కూల్**
**వ్యర్థాలతో సంపద, భూసారం పెంపుపై ప్రకాశం, సత్యసాయి జిల్లాల ప్రాజెక్టులు**
**క్రీడలు, వ్యవసాయంలోనూ అనంతపురం, కర్నూలు జిల్లాల నూతన ఆవిష్కరణలు**



**అమరావతి,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)**

రాష్ట్రంలో నిర్వహించిన 8వ కలెక్టర్ల సదస్సులో ఏడుగురు జిల్లా కలెక్టర్లు తమ జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ పాలనా విధానాలను (బెస్ట్ ప్రాక్టీసెస్) ప్రజెంటేషన్ల ద్వారా వివరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో తాము చేపట్టిన వినూత్న కార్యక్రమాలను, వాటి ద్వారా సాధించిన సత్ఫలితాలను ఈ సదస్సులో వారు పంచుకున్నారు.అల్లూరి సీతారామరాజు జిల్లాలో 'ప్రాజెక్ట్ డ్రోన్' పేరుతో మారుమూల గిరిజన ప్రాంతాలకు డ్రోన్ల ద్వారా అత్యవసర ఔషధాలు, రక్త నమూనాలను సరఫరా చేస్తున్నట్లు కలెక్టర్ నిశాంతి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే 20 వేల మందికి ప్రయోజనం చేకూరిందని తెలిపారు. అనంతపురం జిల్లాలో 'స్కూల్స్ స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్' ద్వారా గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీస్తున్నట్లు కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు.బాపట్ల జిల్లాలో 'స్వర్ణ భవిత' పేరుతో ఆటిజం బాధితులైన విద్యార్థుల కోసం ప్రత్యేకంగా విద్య, వైద్యం, థెరపీ సేవలు అందిస్తున్నట్లు కలెక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. చిత్తూరు జిల్లాలో 'హణఋాఅ-డిజిటల్ స్కూల్ లెర్నింగ్' కార్యక్రమం కింద 22 ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ ఆధారిత డిజిటల్ తరగతులు నిర్వహిస్తున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ వివరించారు.'ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్' పద్ధతిలో తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లోనూ సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నట్లు కర్నూలు జిల్లా కలెక్టర్ సిరి వివరించారు. ఈ విధానంలో జిల్లాలో ఇప్పటికే 1.94 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతోందని పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో 'వేస్ట్ టూ వెల్త్' ప్రాజెక్టు ద్వారా వ్యర్థాల నుంచి 'గ్రీన్ గోల్డ్' బ్రాండ్‌తో సేంద్రియ ఎరువును తయారు చేస్తున్నట్లు కలెక్టర్ రాజాబాబు తెలిపారు. సత్యసాయి జిల్లాలో 'పునర్జీవం' ప్రాజెక్టు కింద బయోచార్‌తో భూసారాన్ని పెంచుతున్నామని, తద్వారా పర్యావరణాన్ని కాపాడుతున్నామని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ వివరించారు.

# ప్రజా సమస్యలు తీర్చండి, ఏఐ వాడండి..



**ప్రజా ఫిర్యాదులను సంతృప్తికరంగా పరిష్కరించాలన్న సీఎం**
**పాలనలో డీప్ టెక్, ఏఐ వంటి ఆధునిక టెక్నాలజీ వాడాలని సూచన**
**ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో సానుకూలత పెంచాలని వెల్లడి**
**గ్రామ, వార్డు సచివాలయ సిబ్బందికి కొత్త జాబ్ ఛార్ట్ ఇవ్వాలన్న సీఎం**
**పనిచేయని వారిని పక్కనపెట్టి, సమర్థులను ప్రోత్సహించాలన్న చంద్రబాబు**

**అమరావతి,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)**

ప్రభుత్వ పాలనలో ప్రజా సంతృప్తే పరమావధిగా పనిచేయాలని, దీనికోసం ఆధునిక టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు జిల్లా కలెక్టర్లకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ల సదస్సులో పాల్గొన్న ఆయన.. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం, పాలనలో టెక్నాలజీ వినియోగం, ప్రజల్లో ప్రభుత్వంపై సానుకూల దృక్పథం పెంపొందించడం అనే మూడు కీలక అంశాలపై ప్రధానంగా దృష్టి సారించారు. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ పథకాలు ప్రజలకు సులభంగా చేరినప్పుడే వాటికి సార్థకత లభిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్)కు వచ్చే దరఖాస్తులను ప్రజలకు పూర్తి సంతృప్తి కలిగేలా పరిష్కరించాలి. ఇందుకోసం జిల్లా స్థాయిలో కలెక్టర్లు, నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేలు, మండల స్థాయిలో అధికారులు తరచూ గ్రామాల్లో పర్యటించాలి. ఇలా నెలకు నాలుగుసార్లు క్షేత్రస్థాయికి వెళ్తే చాలా సమస్యలు అక్కడికక్కడే పరిష్కారమవుతాయి. ఈ పర్యటనల వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలి" అని ఆదేశించారు.పాలనలో టెక్నాలజీ ప్రాధాన్యాన్ని వివరిస్తూ, ప్రభుత్వ శాఖలన్నీ టెక్నాలజీ ఇంటిగ్రేషన్‌తో పనిచేయాలని సూచించారు. "అన్ని రంగాల్లో డీప్ టెక్నాలజీని అమలు చేయాలి. దీని ద్వారా అదనపు అభివృద్ధి సాధించవచ్చు, ప్రభుత్వానికి రెవెన్యూ పెంచుకోవచ్చు. డేటా లేక్‌లో కచ్చితమైన సమాచారాన్ని నమోదు చేసేందుకు ప్రత్యేక విధివిధానాలు రూపొందించండి. ప్రతి శాఖ ఏఐ స్టాక్ టెక్నాలజీని వాడాలి. ఇప్పటికే జీఎస్టీలో ఏఐ వినియోగం సత్ఫలితాలనిస్తోంది. ఇదే తరహాలో, కోర్టుల్లో పేరుకుపోయిన కేసుల పరిష్కారానికి లీగల్ ఏఐ స్టాక్ వినియోగించాలని నిర్ణయించాం" అని చంద్రబాబు వివరించారు.ప్రజల కోసం ఎన్నో పథకాలు, పాలసీలు తీసుకొస్తున్నామని, వాటిని సులభంగా అందించినప్పుడే ప్రజల్లో ప్రభుత్వం పట్ల సానుకూల దృక్పథం పెరుగుతుందని సీఎం అన్నారు. "ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల్లో పాజిటివ్ పర్సెప్షన్ రావాలి. లోటుపాట్లను ఎప్పటికప్పుడు సవరించుకుని మరింత సమర్థంగా సేవలు అందించాలి. పనిచేసే వారిని గుర్తించి ప్రోత్సహించండి, సరిగా పనిచేయని వారిని పక్కన పెట్టండి" అని కఠినంగా సూచించారు.స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సిబ్బంది పనితీరును మెరుగుపరచడంపై కూడా సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు. "ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా స్వర్ణ గ్రామ, వార్డు సిబ్బందికి స్పష్టమైన విధులతో కూడిన జాబ్ ఛార్ట్ సిద్ధం చేయాలి. కొందరిపై ఎక్కువ పనిభారం, మరికొందరిపై తక్కువ పనిభారం ఉన్నట్లు గమనించాం. దీన్ని సరిచేసి పనిని హేతుబద్ధీకరించాలి (రేషనలైజ్ చేయాలి). ప్రతి కార్యాలయానికి ఒక ఈవీ సైకిల్ అందించండి" అని తెలిపారు.ఇదే సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ.. జిల్లాల ఆర్థిక నివేదికలతో పాటు, పాలనపై ప్రజల్లో ఉన్న సానుకూల దృక్పథం వివరాలను మంత్రులు, ప్రజాప్రతినిధులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని కలెక్టర్లను కోరారు. మొత్తం మీద, టెక్నాలజీని వాడుకుంటూ, ప్రజా సమస్యలను పరిష్కరించి, పాలనపై సానుకూలత పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# సాధిక్‌ఖాన్ విచారణలో కీలక పురోగతి.. నిజాలు కక్కిన నిందితుడు

**నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో పురోగతి**
**మూడో రోజు విచారణలో నిజాలు ఒప్పుకున్న సాధిక్‌ఖాన్**
**విషం పెట్టి జగదీశ్వరరెడ్డిని హత్య చేసినట్లు అంగీకారం!**
**రూ.25 కోట్ల ఆస్తి కోసమే ఈ దారుణానికి పాల్పడినట్లు వెల్లడి**
**నేడు నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్న పోలీసులు**

**అమరావతి,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పంచాయతీరాజ్ ఏఈ నూకరాజు కుటుంబం ఆత్మహత్య కేసులో కీలక పురోగతి లభించింది. ఈ కేసులో ప్రధాన నిందితుడైన షేక్ సాధిక్‌ఖాన్ పోలీసుల విచారణలో నోరు విప్పినట్లు తెలిసింది. నూకరాజు అల్లుడు జగదీశ్వరరెడ్డిని తానే హత్య చేసినట్లు అంగీకరించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. మూడో రోజు విచారణలో పోలీసులు పక్కా ఆధారాలు చూపడంతో సాధిక్‌ఖాన్ నిజాలు ఒప్పుకున్నట్లు తెలుస్తోంది.మూడు రోజుల పోలీసు కస్టడీలో ఉన్న సాధిక్‌ఖాన్‌ను సర్వవరం పోలీసులు విచారిస్తున్నారు. తొలి రెండు రోజులు పొంతనలేని సమాధానాలిస్తూ, 'గుర్తులేదు', 'తెలియదు' అంటూ విచారణకు సహకరించలేదు. అయితే, గురువారం పోలీసులు సాంకేతిక ఆధారాలు, అతడికి సైనైడ్ విక్రయించిన వ్యాపారుల వాంగ్మూలాలను ముందుంచడంతో దిగివచ్చినట్లు సమాచారం. జగదీశ్వరరెడ్డిని చంపేందుకు విషపదార్థం ఉపయోగించినట్లు అంగీకరించినట్టు తెలిసింది.సుమారు రూ.25 కోట్ల విలువైన ఆస్తిపై కన్నేసిన సాధిక్‌ఖాన్, నూకరాజు కుమార్తె సౌజన్యను వివాహం చేసుకుంటే ఆస్తి మొత్తం తనకే దక్కుతుందని భావించాడు. ఈ క్రమంలోనే అడ్డుగా ఉన్న జగదీశ్వరరెడ్డిని తొలగించుకోవాలని పథకం పన్నాడు. ఇందుకోసం హైదరాబాద్‌లోని వ్యాపారుల నుంచి రైఫిల్ షూటింగ్ అవసరాల పేరుతో థాలియం, పొటాషియం వంటి రసాయనాలను కొనుగోలు చేశాడు.

# పూర్తి పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించాం



**డీఎస్సీతో 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చామన్న కేశినేని చిన్ని**
**డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి మధ్య తేడా కూడా తెలియని వ్యక్తి జగన్ అని విమర్శ**
**ఐదేళ్ల పాలనలో జగన్ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని మండిపాటు**

**అమరావతి,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)**

ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం డీఎస్సీ పరీక్షలను అత్యంత పారదర్శకంగా నిర్వహించి 16 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించిందని విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ఈ మెగా డీఎస్సీపై వైసీపీ అధినేత జగన్, ఆ పార్టీ నేతలు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు రావాలని లోకేశ్ సవాల్ విసిరినా జగన్ ఇంతవరకు ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. త్వరలోనే లోకేశ్ నాయకత్వంలో మరో మూడు డీఎస్సీలను విజయవంతంగా నిర్వహించి తీరుతామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.డీఎస్సీ, ఏపీపీఎస్సీ నిర్వహణకు ఉన్న ప్రాథమిక వ్యత్యాసం కూడా తెలీని వ్యక్తి జగన్ అని కేశినేని చిన్ని ఎద్దేవా చేశారు. స్పోర్ట్స్ కోటాలో ప్రత్యేకంగా పరీక్షలు ఉండవని, ఆ కేటాయింపులు నేరుగా సర్టిఫికెట్ల ఆధారంగా, మెరిట్ ప్రకారం జరుగుతాయని తెలిసినా వైసీపీ అసత్యాలు ప్రచారం చేస్తోందన్నారు. ప్రైవేట్ పాఠశాలలో పనిచేస్తున్న రామకృష్ణ అనే వ్యక్తికి డీఎస్సీలో ఉద్యోగం వస్తే, ఆయనకు రానట్లు సాక్షి పత్రికలో అబద్ధాలు రాశారని, ఆ బాధితుడు రామకృష్ణ స్వయంగా ఇక్కడే సజీవ సాక్ష్యంగా ఉన్నారని మీడియా ముందు ప్రదర్శించారు. ఐదేళ్ల పాలనలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వని జగన్, తొమ్మిది నెలలుగా కుంభకర్ణుడిలా నిద్రపోయి ఇప్పుడు గ్లోబల్ ప్రచారంతో ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.సొంత బాబాయి వివేకానందరెడ్డి హత్య కేసులో గొడ్డలిపోటును గుండెపోటుగా చిత్రీకరించడం, కోడికత్తి డ్రామాలు ఆడటం జగన్‌కు అలవాటేనని ఎంపీ ధ్వజమెత్తారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ, గ్రూప్-1 నియామకాలలో జరిగిన భారీ అవకతవకలపై ప్రస్తుతం కోర్టు ఆదేశాల మేరకు విచారణ జరుగుతోందని తెలిపారు. ఆ అక్రమాల నివేదిక బయటకు వచ్చి తమ తప్పులు బయటపడతాయనే భయంతోనే డీఎస్సీపై వైసీపీ నేతలు బురద జల్లుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఇచ్చిన సమాచారం తప్పని నిరూపించే దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలని జగన్‌కు సవాల్ విసిరారు. ఇటువంటి దిగజారుడు రాజకీయాలు చేస్తే వచ్చే ఎన్నికల్లో జగన్ కనీసం ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని జోస్యం చెప్పారు.

# నేతన్న భరోసా పెన్షన్ దరఖాస్తు కోసం బ్యాంక్ స్టేట్‌మెంట్ అవసరం లేదు: సవిత



**మాస్టర్ వీవర్ ఇచ్చే ధ్రువీకరణ పత్రం, వేతన వివరాలు ఇస్తే సరిపోతుందన్న సవిత**
**బ్యాంక్ స్టేట్‌మెంట్ సేకరణలో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్న మంత్రి**
**అర్హులైన నేతన్నలందరికీ పింఛన్లు ఇస్తామని హామీ**

**అమరావతి,సెప్టెంబర్11,(సామాన్యుడి అస్త్రం)**

ఆంధ్రప్రదేశ్‌లోని చేనేత కార్మికులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీపి కబురు అందించింది. 'నేతన్న భరోసా' పెన్షన్ పథకం దరఖాస్తు ప్రక్రియలో అత్యంత కీలకమైన నిబంధన నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకునే నేతన్నలు బ్యాంక్ ఖాతా సమర్పించాల్సిన అవసరం లేదని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత వెల్లడించారు.బ్యాంక్ స్టేట్‌మెంట్‌కు ప్రత్యామ్నాయంగా సంబంధిత మాస్టర్ వీవర్ (సొసైటీ/యజమాని) ఇచ్చే ధ్రువీకరణ పత్రంతో పాటు వేతన వివరాల పత్రాన్ని అందిస్తే సరిపోతుందని మంత్రి స్పష్టం చేశారు. బ్యాంకు ఖాతా స్టేట్‌మెంట్ల సేకరణలో అర్హులైన చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందులను గమనించి ప్రభుత్వం ఈ సులభతర నిర్ణయాన్ని తీసుకున్నట్లు తెలిపారు. 50 ఏళ్లు నిండిన అర్హులైన నేతన్నలందరికీ తప్పకుండా పింఛన్లు మంజూరు చేస్తామని, నేతన్నల సంక్షేమానికి తమ ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందోనని అన్నారు.

# రీజినల్ రింగ్ రోడ్డుకు బీజేపీ సహకరించాలి..



**హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి ఆస్త్రం)**

రీజినల్ రింగ్ రోడ్డు కు రాష్ట్రంలోని భారతీయ జనతా పార్టీ సహకరించాలని.. కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు కోరారు. రీజినల్ రింగ్ రోడ్డు వస్తే జిల్లాలకు కనెక్టివిటీ పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అప్పుడు ఐటీ కంపెనీలు ముందుకు వచ్చే అవకాశం ఉందన్నారు. శుక్రవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇచ్చారు.డేటా సెంటర్ల కోసం రూ.70 వేల కోట్ల పెట్టుబడులు తెచ్చామని వివరించారు. డేటా సెంటర్ల విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని పేర్కొన్నారు. హైదరాబాద్లో గూగుల్ ఇంకుబేషన్ హబ్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. వరంగల్ ఎయిర్ పోర్ట్ అందుబాటులోకి వస్తే అక్కడకు కంపెనీలు పెద్ద ఎత్తున వచ్చే అవకాశం ఉందని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.గత ప్రభుత్వంలో కొన్ని జిల్లాల్లో ఐటీ టవర్లను నిర్మించి వదిలేశారని చెప్పారు. అవి చాలా వరకు నిరుపయోగంగా ఉన్నాయన్నారు. సోషల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉంటేనే ఐటీ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయని అన్నారు. స్పెషల్ ఇన్సెంటివ్స్ ఇచ్చి కంపెనీలను రప్పించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. రెండు మూడు రోజుల్లో ఆదిలాబాద్‌లో ఐటీ టవర్ ప్రారంభిస్తామని మంత్రి వివరించారు. పెద్దపల్లిలో యాంకర్ పార్టనర్ కోసం వెతుకుతున్నామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# మెట్రో టేకోవర్ కోసం రుణాల వేట



**3 శాతంతో సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశం**
**జాతీయ, అంతర్జాతీయ బ్యాంకులతో సంప్రదింపులు**

**హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి ఆస్త్రం)**

మొదటి దశ మెట్రో టేకోవర్ కోసం కావాల్సిన రుణాల కోసం ఎస్‌బీఐ క్యాపిటల్ సంస్థ (ఎస్‌బీఐ క్యాప్స్) పడరాని పాట్లు పడుతోంది. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన 3 శాతం వడ్డీతోపాటు మూడు నెలల్లోగా పనిని పూర్తిచేయాలని విధించిన టార్గెట్‌తో సదరు కంపెనీ ప్రతినిధులు సతమతమవుతున్నారు. నిర్ణీత గడువులోగా ప్రక్రియను ముగించాలనే ఆరాటంతో ముందుకుసాగుతున్నారు.నగరంలో రెండో దశ ప్రాజెక్టులోని 7 కారిడార్లకు అనుమతి కావాలంటే అందుకు అనుగుణంగా ఉన్న ఫస్ట్ ఫేజ్‌ను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని కేంద్ర ప్రభుత్వం కొన్ని నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిన విషయం తెలిసిందే. ఈ మేరకు రూ.15వేల కోట్లతో ఎల్అండ్‌టీ నుంచి మూడు కారిడార్లను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో రూ.13,600 కోట్ల రుణాలను బ్యాంకుల ద్వారా సేకరించేందుకు ముంబై ప్రధాన కేంద్రంగా నడిచే ఎస్‌బీఐ క్యాపిటల్ సంస్థకు బాధ్యతలు అప్పగించింది. మిగతా రూ.1,400 కోట్లను సొంతంగా చెల్లించేందుకు నిర్ణయించింది.

**అధిక వడ్డీతోనే ఎల్అండ్‌టీ కుదేలు**

మొదటి దశ ప్రాజెక్టు కింద ఎల్‌బీనగర్–మియాపూర్, జేబీఎస్–ఎంజీబీఎస్, నాగోలు–రాయదుర్గం కారిడార్లలో 72 కిలోమీటర్ల మేర పనులను 2012లో ఎల్అండ్‌టీ సంస్థ చేపట్టింది. ప్రైవేట్ పబ్లిక్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) మోడల్‌లో సదరు సంస్థ సొంతంగా నిర్మాణం చేసింది. మొత్తం 72 కిలోమీటర్లలో 69 కిలోమీటర్లు పూర్తి చేసింది. ఇందుకోసం అప్పటి ప్రభుత్వం నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న 269 ఎకరాలను రవాణా ఆధారిత అభివృద్ధి (టీవోడీ) కింద అప్పగించింది.60 ఏళ్లపాటు అందులో వాణిజ్య కార్యకలాపాలను నిర్వహించుకుని మెట్రో ఆపరేషన్స్ చేపట్టాలని సూచించింది. అయితే 2012లో రూ.14,132 కోట్లతో ప్రారంభించిన ప్రాజెక్టు పనులు.. మొత్తం పూర్తయ్యే వరకు రూ.22వేల కోట్లకు పెరిగింది. దీంతో ప్రతిపాదిత పనులను పూర్తి చేసేందుకు ఎల్అండ్‌టీ వివిధ బ్యాంకుల నుంచి అనివార్యంగా అప్పులు తీసుకొచ్చింది. కొన్ని బ్యాంకుల నుంచి 7–8 శాతం వడ్డీతో రుణాలను తీసుకురావడంతో వాటిని కట్టలేక కుదేలైంది.కరోనాతో కార్యకలాపాలు స్తంభించిపోవడంతో అప్పులు, వడ్డీల భారం అంతకంతకూ పెరిగిపోయి నష్టాలబాట పట్టింది. ఈ నేపథ్యంలో ఎల్అండ్‌టీ లాంటి పరిస్థితి తమకు రాకుండా ఉండేందుకు ముందు జాగ్రత్తగా 3 శాతం వడ్డీతోనే రుణాల సేకరణ చేయాలని ఎస్‌బీఐ క్యాప్స్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. కాగా, సుమారు రూ.2.50 కోట్లతో కన్సల్టెన్సీని దక్కించుకున్న సంస్థ పడరాని పాట్లు పడుతోంది.

**డాక్యుమెంట్‌తో బ్యాంకుల వద్ద అభ్యర్థన**

కేవలం 3 శాతం వడ్డీతో రుణాలు తీసుకొచ్చేందుకు జాతీయ, అంతర్జాతీయ బ్యాంకులతో ఎస్‌బీఐ క్యాప్స్ సంప్రదింపులు చేస్తోంది

## జీవో నంబర్ 97పై అసెంబ్లీ వేదికగా

# మంత్రి వివేక్ కీలక ప్రకటన..

**హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి ఆస్త్రం)**



పాలిటెక్నిక్ విద్యార్థులు, అధ్యాపకులు జీవో నంబర్ 97పై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. విద్యార్థుల ఆందోళనలను పరిష్కరించడంతో పాటు వారి భవిష్యత్తుకు పూర్తి రక్షణ కల్పిస్తామని అసెంబ్లీ వేదికగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జీవో 97లో అవసరమైన మార్పులు, చేర్పులు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ మేరకు కె.కేశవరావు కమిటీ సభ్యులతో నిరంతరం చర్చలు జరుపుతున్నామని, అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని విద్యార్థులకు మేలు జరిగేలా జీవోలో మార్పులు తీసుకొస్తామని మంత్రి వెల్లడించారు.పాలిటెక్నిక్ విద్యార్థులకు ఈసెట్ పరీక్ష ఉంటుందని, దీనిపై ఎలాంటి అపోహలు అవసరం లేదని మంత్రి వివేక్ తెలిపారు. ఫీజులు పెరుగుతాయంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్లు ప్రైవేటు ఉద్యోగులుగా మారుతారనే ఆందోళనా అవసరం లేదని చెప్పారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల హోదా కొనసాగుతుందని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. అలాగే పాలిటెక్నిక్ కళాశాలల భూములను ప్రభుత్వం విక్రయిస్తుందంటూ బీఆర్ఎస్ చేస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. పాలిటెక్నిక్ కళాశాలలను మోడల్ సంస్థలుగా తీర్చిదిద్దుతున్నామని, వాటిని స్కిల్ యూనివర్సిటీతో అనుసంధానం చేశామని మంత్రి చెప్పారు.విద్యార్థుల్లో అపోహలు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటిని నమ్మకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను గమనించాలని మంత్రి వివేక్ సూచించారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు టామ్‌కామ్ ద్వారా చర్యలు చేపడుతున్నామనీ తెలిపారు. పాస్‌పోర్టులు, ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ గతంలో కొన్ని ప్రైవేటు ఏజెన్సీలు యువతను మోసం చేశాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టామ్‌కామ్‌ను ఏర్పాటు చేశారని చెప్పారు. జర్మన్, జపాన్ భాషల్లో శిక్షణ అందించడం ద్వారా సుమారు 25 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. జపాన్‌లో పర్యటించి అక్కడి సంస్థలతో యువతకు ఉద్యోగ అవకాశాలపై చర్చించామని మంత్రి వెల్లడించారు.తెలంగాణ పాలిటెక్నిక్ విద్యార్థులకు జపాన్‌లో డిమాండ్ ఉందని, తమకు పాలిటెక్నిక్ విద్యార్థులు అవసరమని అక్కడి ప్రతినిధులు చెప్పారని మంత్రి వివేక్ పేర్కొన్నారు. కేంద్ర మంత్రి జయంత్ చౌదరి ఆధ్వర్యంలో ఇటీవల ఢిల్లీలో జరిగిన సమావేశంలో వివిధ రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రులు పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ఇతర రాష్ట్రాల మంత్రులు అభినందించారని చెప్పారు. అన్ని రాష్ట్రాలకు కేంద్రం ఒక్క క్లస్టర్ చొప్పున కేటాయించగా.. తెలంగాణకు నాలుగు క్లస్టర్లు మంజూరు చేసిందని వెల్లడించారు.మల్లెపల్లిలోని ఐటీఐను అత్యుత్తమంగా తీర్చిదిద్దామని మంత్రి వివేక్ తెలిపారు. ప్రతిపక్ష, కాంగ్రెస్ ఎమ్మెల్యేలను వీలైనప్పుడు అక్కడికి తీసుకెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను చూపిస్తానని చెప్పారు. విద్యార్థులకు నైపుణ్య శిక్షణ, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

## హైదరాబాద్ వాసులకు అలర్ట్..

# ఈ రూట్లలో ట్రాఫిక్ ఆంక్షలు




**హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి ఆస్త్రం)**

ఖైరతాబాద్ బడా గణేశ్ దర్శనానికి భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు అప్రమత్తమయ్యారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని సెప్టెంబరు 12 నుంచి 24వ తేదీ వరకు పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నారు. ప్రతిరోజు ఉదయం 11 గంటల నుంచి రాత్రి వరకు అవసరాన్ని బట్టి వాహనాల దారి మళ్లింపులు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

**వాహనాల దారి మళ్లింపు**

వీవీ విగ్రహం నుంచి వచ్చే వాహనాలను నిరంకారి జంక్షన్ వైపునకు మళ్లించనున్నట్లు పోలీసులు తెలిపారు. పాత పీఎస్ సైఫాబాద్ నుంచి బడా గణేశ్ వైపు వాహనాలకు అనుమతి లేదన్నారు. రాజ్‌దూత్ లేన్ వద్ద ఇక్బాల్ మినార్ వైపు వాహనాలను మళ్లించనున్నట్లు చెప్పారు. ఇక్బాల్ మినార్ నుంచి ఐమ్యాక్స్ వైపు ట్రాఫిక్‌కు ఆంక్షలు ఉండనున్నట్లు పేర్కొన్నారు. మింట్ కాంపౌండ్ వద్ద సెక్రటేరియట్ ఎక్స్ రోడ్డు వైపు వాహనాలను దారి మళ్లించనున్నట్లు వెల్లడించారు. నెక్లెస్ రోటరీ నుంచి మింట్ కాంపౌండ్ వైపు ట్రాఫిక్‌కు ఆంక్షలు ఉండనున్నట్లు తెలిపారు. నెక్లెస్ రోటరీ వద్ద సెక్రటేరియట్ జంక్షన్ లేదా ఖైరతాబాద్ ఫ్లైఓవర్ వైపు వాహనాలను మళ్లించనున్నట్లు వివరించారు. అలాగే, నిరంకారి నుంచి ఖైరతాబాద్ రైల్వే గేట్ వైపు వాహనాలకు అనుమతి లేదన్నారు. ఖైరతాబాద్ పోస్ట్ ఆఫీస్ వద్ద పాత పీఎస్ సైఫాబాద్ మీదుగా దారి మళ్లించనున్నట్లు చెప్పారు.

**రద్దీకి అవకాశం ఉండే ప్రాంతాలివే**

ఖైరతాబాద్, షాదాన్ కాలేజ్, అయోధ్య ప్రాంతాల్లో భారీగా వాహనాల రద్దీకి అవకాశం ఉందని పోలీసులు తెలిపారు. నిరంకారి, సైఫాబాద్, మింట్ కాంపౌండ్‌లో ట్రాఫిక్ జామ్‌కు అవకాశం ఉందన్నారు. ఎన్టీఆర్ మార్గ్, సెక్రటేరియట్ జంక్షన్‌లోనూ రద్దీ ఉండే అవకాశాలు ఉన్నాయన్నారు. నెక్లెస్ రోటరీ, కేసీపీ జంక్షన్, మాసాబ్ ట్యాంక్ వైపు ప్రయాణాలు తగ్గించుకోవాలని సూచించారు. భక్తులు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ట్రాఫిక్ పోలీసులు చెప్పారు.

**భక్తులకు ప్రత్యేక పార్కింగ్ సదుపాయాలు**

మరోవైపు, భాగ్యనగరంలో గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో వాహనదారులకు పార్కింగ్ సదుపాయం కల్పించినట్లు పోలీసులు తెలిపారు. నెక్లెస్ రోటరీ, ఎన్టీఆర్ గార్డెన్ వైపు భక్తులకు రేస్ కోర్స్ రోడ్, ఎన్టీఆర్ ఘాట్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఐమ్యాక్స్ పక్కన హెచ్ఎండీఏ పార్కింగ్‌లో వాహనాలకు అవకాశం ఉందన్నారు. ఐమ్యాక్స్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలోనూ పార్కింగ్ చేసుకోవచ్చన్నారు. ఖైరతాబాద్ జంక్షన్ వైపు వచ్చే భక్తులకు విశ్వేశ్వరయ్య భవన్‌లో పార్కింగ్ సదుపాయం ఉందన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని వాహనదారులు, భక్తులకు విజ్ఞప్తి చేశారు. అత్యవసర సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

# భూములు తీసుకుని, రియల్ ఎస్టేట్ చేస్తే చర్యలు తప్పవు: దానం నాగేందర్

**హైదరాబాద్,సెప్టెంబర్11,(సామాన్యుడి ఆస్త్రం)**

అసెంబ్లీలో ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హైదరాబాద్‌లో కంపెనీలకు కేటాయిస్తున్న భూముల వినియోగంపై కీలక వ్యాఖ్యలు చేశారు. కొన్ని కంపెనీలకు ఇచ్చిన భూములను రియల్ ఎస్టేట్ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారనే అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి పెట్టాలని సూచించారు. కంపెనీలకు భూములు కేటాయించే సమయంలో స్పష్టమైన నిబంధనలు, ఆంక్షలు విధించాలని కోరారు. కేటాయించిన భూములను కంపెనీలు తమ ప్రధాన వ్యాపార కార్యకలాపాలకే వినియోగించేలా పర్యవేక్షణ ఉండాలని పేర్కొన్నారు.మరోవైపు టెక్ మహీంద్రా వంటి దిగ్గజ సాఫ్ట్‌వేర్ కంపెనీలు హైదరాబాద్‌కు వస్తున్నప్పటికీ.. నగరంపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని దానం నాగేందర్ అన్నారు. ఇలాంటి కంపెనీలు హైదరాబాద్‌కు వచ్చి కేవలం కాఫీ తాగి వెళ్లిపోయే పరిస్థితి ఉండకూడదని వ్యాఖ్యానించారు.



# రోజూ కడుపు ఉబ్బరంగా ఉంటోందా? ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త!



**ఒకట్రెండు రోజులు ఉబ్బరం ఉంటే సాధారణమే**
**ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారంతో పాటు కొన్ని పప్పులు, కూరగాయలతోనూ గ్యాస్ సమస్య**
**రోజంతా కడుపు ఉబ్బితే మాత్రం జీర్ణ సమస్యలు ఉండే ఛాన్స్**
**బరువు తగ్గడం, మలంలో రక్తం వంటి లక్షణాలు కనిపిస్తే మాత్రం జాగ్రత్తపడాల్సిందే!**

అప్పుడప్పుడూ కడుపు ఉబ్బరంగా ఉండడం సాధారణమే. ఎక్కువగా తినడం, కూల్‌డ్రింక్స్ తాగడం, పప్పులు, కొన్ని కూరగాయలు తినడం, వేగంగా భోజనం చేయడం వంటి కారణాలతో జీర్ణవ్యవస్థలో గ్యాస్ పెరిగి కడుపు ఉబ్బినట్లు అనిపించొచ్చు. సాధారణంగా కొంతసేపటికి ఈ సమస్య తగ్గిపోతుంది. అయితే రోజూ కడుపు ఉబ్బరంగా ఉండటం, రోజంతా పెరుగుతూ పోవడం లేదా రాత్రికి కూడా తగ్గకపోవడం మాత్రం నిర్లక్ష్యం చేయకూడదు.

### ఎప్పుడు కడుపు ఉబ్బరం సాధారణం?

ఫైబర్ ఎక్కువగా ఉన్న ఆహారం జీర్ణమయ్యే సమయంలో సహజంగానే గ్యాస్ ఉత్పత్తి అవుతుంది. పప్పులు, కొన్ని కూరగాయలు, కార్బొనేటెడ్ డ్రింక్స్, ఎక్కువ మోతాదులో ఆహారం తీసుకున్నప్పుడు తాత్కాలికంగా కడుపు నిండినట్లు అనిపించొచ్చు.త్వరగా తినడం, చూయింగ్‌గమ్ నమలడం, స్ట్రా ద్వారా పానీయాలు తాగడం, తింటున్నప్పుడు ఎక్కువగా మాట్లాడటం వల్ల కూడా గాలి ఎక్కువగా మింగే అవకాశం ఉంటుంది.ఏదైనా ఆహారం తిన్న తర్వాత మాత్రమే ఉబ్బరం వచ్చి.. కొంతసేపటికి తగ్గిపోతే సాధారణంగా ఆందోళన అవసరం ఉండదు.

### రోజూ ఉబ్బరంగా ఉంటే..

రోజూ కడుపు ఉబ్బరంగా ఉండటం లేదా రోజంతా సమస్య ఎక్కువవుతూ పోవడం వెనుక కొన్ని జీర్ణవ్యవస్థ సమస్యలు ఉండొచ్చు. ముఖ్యంగా.. ఇరిటబుల్ బవెల్ సింట్రోమ్ (ఐబీఎస్), మలబద్ధకం, కొన్ని ఆహార పదార్థాలకు అలర్జీ, ల్యాక్టోజ్ ఇంటాలరెన్స్, సీలియాక్ వ్యాధి, చిన్న పేగులో బ్యాక్టీరియా అధికంగా పెరగడం, ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్, కడుపు ఖాళీ కావడం ఆలస్యమవడం, మలబద్ధకం ఉన్నప్పుడు పేగుల్లో మలం ఎక్కువసేపు ఉండటం వల్ల గ్యాస్ పేరుకుపోయి కడుపుపై ఒత్తిడి, ఉబ్బరం పెరగొచ్చు.

### ఈ లక్షణాలు కనిపిస్తే..

కడుపు ఉబ్బరంతో కారణం లేకుండా బరువు తగ్గడం, మలంలో రక్తం కనిపించడం, మలం నల్లగా రావడం, తీవ్రమైన లేదా నిరంతర కడుపునొప్పి, జ్వరం, రక్తహీనత, మింగడంలో ఇబ్బంది, నిద్రలో నుంచి మేల్కొలిపే లక్షణాలు, 50 ఏళ్ల తర్వాత అకస్మాత్తుగా మొదలైన నిరంతర ఉబ్బరం, కుటుంబంలో పెద్దపేగు క్యాన్సర్, సీలియాక్ వ్యాధి లేదా ఇన్‌ఫ్లమేటరీ బవెల్ డిసీజ్ చరిత్ర ఉన్నా వైద్య సలహా తీసుకోవాలి.

### ఉబ్బరం తగ్గాలంటే ఏం చేయాలి?

భోజనాన్ని నెమ్మదిగా తినడం, ఆహారాన్ని బాగా నమలడం ద్వారా గాలి మింగడాన్ని తగ్గించవచ్చు. రోజూ శారీరకంగా చురుగ్గా ఉండటం జీర్ణవ్యవస్థ కదలికలకు సహాయపడుతుంది.తగినంత నీరు తాగడం, మలబద్ధకం రాకుండా చూసుకోవడం కూడా ఉపయోగకరం. ఫైబర్‌ను ఒక్కసారిగా ఎక్కువగా పెంచకుండా క్రమంగా పెంచాలి. లేకపోతే గ్యాస్, ఉబ్బరం మరింత పెరిగే అవకాశం ఉంటుంది.
ఏ ఆహారం తీసుకున్న తర్వాత ఉబ్బరం ఎక్కువగా వస్తుందో తెలుసుకోవడానికి ఫుడ్ అండ్ సింప్టమ్ డైరీ మెయింటైన్ చేయడం కూడా ఉపయోగపడుతుంది.

# భోజనం చేసిన వెంటనే పండ్లు తినొచ్చా? నిపుణులు చెబుతోంది ఇదే..!

**భోజనం తర్వాత పండ్లు తినడం సురక్షితమంటున్న నిపుణులు**
**కడుపులో పండ్లు కుళ్లిపోతాయన్న ప్రచారానికి ఆధారాలు లేవని స్పష్టీకరణ**
**జీర్ణక్రియను నెమ్మదింపజేసే పండ్లలోని పీచు పదార్థం**
**దీంతో ఎక్కువసేపు కడుపు నిండిన భావన**
**నియంత్రణలో రక్తంలో చక్కెర పెరుగుదల**
**సున్నితమైన జీర్ణవ్యవస్థ ఉన్నవారికి ఉబ్బరానికి అవకాశం**

భోజనం ముగిసిన వెంటనే యాపిల్, బొప్పాయి.. ఇలా ఏదో ఒక పండు తినడం చాలా ఇళ్లలో అలవాటు. స్వీట్లకు బదులుగా పండ్లు తినడం ఆరోగ్యకరమనే భావనే అందుకు కారణం. అయితే భోజనం చేసిన వెంటనే పండ్లు తింటే కడుపులో అవి కుళ్లిపోతాయని, గ్యాస్ వస్తుందని, జీర్ణక్రియ దెబ్బతింటుందని సోషల్ మీడియాలో ఈ మధ్య ప్రచారం జరుగుతోంది. ఇందులో నిజమెంత?నిపుణుల ప్రకారం ఈ ప్రచారానికి శాస్త్రీయ ఆధారాలు లేవు. మన కడుపులో ఉండే ఆమ్లాల స్థాయి చాలా ఎక్కువగా ఉంటుంది. అలాంటి పరిస్థితుల్లో పండ్లు కుళ్లిపోవడం లేదా పులియడం జరగదని చెబుతున్నారు. భోజనం తర్వాత పండ్లు తింటే అవి కడుపులో కొంతసేపు ఎక్కువగా ఉండొచ్చు. కానీ అది సహజమైన జీర్ణ ప్రక్రియలో భాగమే తప్ప సమస్య కాదని వివరిస్తున్నారు.పండ్లలో ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను కొద్దిగా నెమ్మదింపజేస్తుంది. దీంతో ఎక్కువసేపు కడుపు నిండిన భావన ఉంటుంది. మధ్యలో ఆకలి తగ్గుతుంది. అలాగే రక్తంలో చక్కెర ఒక్కసారిగా పెరగకుండా కూడా సహాయపడుతుంది.మధుమేహం ఉన్నవారికి కూడా భోజనంతో పాటు లేదా తర్వాత పండ్లు తీసుకోవడం కొన్ని సందర్భాల్లో ప్రయోజనకరంగా ఉండొచ్చని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా ప్రోటీన్లు, ఆరోగ్యకర కొవ్వులు ఉన్న ఆహారంతో కలిపి పండ్లు తింటే రక్తంలో చక్కెర స్థాయులు ఒక్కసారిగా పెరగకుండా ఉండొచ్చు.అయితే అందరికీ ఒకే విధమైన అనుభవం ఉండదు

## పంచదార మానేస్తే ముఖం నాజూగ్గా మారుతుందా?
# నిపుణులు ఏమంటున్నారు?

**చక్కెర తగ్గించడం వల్ల ముఖం సన్నగా కనిపించవచ్చని నిపుణుల మాట**
**శరీరంలో నీటిశాతం తగ్గడంతో ముఖంలోని ఉబ్బు తగ్గుతుందని వెల్లడి**
**ఇది నేరుగా ముఖంలోని కొవ్వును కరిగించదని స్పష్టీకరణ**
**మొత్తం శరీర బరువు తగ్గితేనే ముఖంలో మార్పు కనిపిస్తుందంటున్న నిపుణులు**



పంచదార, తీపి పదార్థాలను పూర్తిగా మానేయడం ద్వారా ముఖం సన్నగా, నాజూగ్గా మారుతుందని, దవడల ఆకృతి మెరుగుపడుతుందని సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. అయితే, ఈ వాదనలో పూర్తి నిజం లేదని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు. చక్కెరను తగ్గించడం వల్ల ముఖం సన్నగా కనిపించడానికి పరోక్ష కారణాలు ఉన్నాయే తప్ప, అది నేరుగా ముఖంలోని కొవ్వును కరిగించదని వారు వివరిస్తున్నారుఢిల్లీలోని ఇంద్రప్రస్థ అపోలో హాస్పిటల్స్ సీనియర్ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ రిచా చతుర్వేది తెలిపిన వివరాల ప్రకారం, చక్కెర అధికంగా ఉండే పానీయాలు, ప్రాసెస్ చేసిన ఆహారాలను మానేసినప్పుడు సహజంగానే కేలరీల వినియోగం తగ్గుతుంది. ఇది కాలక్రమేణా మొత్తం శరీర బరువు తగ్గడానికి దోహదపడుతుంది. ఫలితంగా ముఖం కూడా సన్నబడినట్లు కనిపిస్తుంది.అంతేకాకుండా, అధిక చక్కెర వినియోగం వల్ల శరీరంలో నీరు నిలిచిపోయి ముఖం ఉబ్బినట్లుగా కనిపిస్తుంది. చక్కెరను తగ్గించినప్పుడు ఈ నీటి నిల్వలు తగ్గి, బుగ్గలు, దవడల వద్ద వాపు తగ్గడం వల్ల ముఖం స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, ఇది ముఖంలోని కొవ్వు తగ్గడం కాదని ఆమె స్పష్టం చేశారు. శరీరంలోని కొవ్వు అనేది జన్యువులు, వయసు, హార్మోన్ల ప్రభావంపై ఆధారపడి ఉంటుందని, కేవలం ముఖంలోని కొవ్వును మాత్రమే లక్ష్యంగా చేసుకుని తగ్గించడం సాధ్యం కాదని వివరించారు.ముంబైకి చెందిన మరో ప్రముఖ ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ షెహ్లా షేక్ కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. చక్కెర మానేసిన వెంటనే ముఖంలో కనిపించే మార్పులు కేవలం నీటి నిల్వలు తగ్గడం వల్లేనని, అసలు కొవ్వు తగ్గడానికి సమయం పడుతుందని తెలిపారు. కాబట్టి, కేవలం చక్కెరను మానేయడంపైనే కాకుండా, సమతులాహారం, వ్యాయామం, తగినంత నీరు తాగడం వంటి ఆరోగ్యకరమైన జీవనశైలిపై దృష్టి సారించాలని నిపుణులు సూచిస్తున్నారు.

# సూక్ష్మ పోషకాలు: ఏవి ఎందుకు అవసరమో తెలుసుకోండి!



**శరీరానికి తక్కువ మోతాదులో అవసరమయ్యే విటమిన్లు, ఖనిజాలే సూక్ష్మ పోషకాలు**
**రోగనిరోధక శక్తి, ఎముకల ఆరోగ్యం, శక్తి ఉత్పత్తికి ఇవి అత్యంత కీలకం**
**విటమిన్ ఎ కంటి చూపుకు, ఐరన్ రక్త వృద్ధికి, కాల్షియం ఎముకల పటిష్టతకు అవసరం**
**సమతుల ఆహారం ద్వారానే ఈ పోషకాలను తగినంతగా పొందడం సాధ్యం**

మన శరీరం ఒక సంక్లిష్టమైన యంత్రం లాంటిది. ఇది సక్రమంగా పనిచేయాలంటే కేవలం పిండిపదార్థాలు, ప్రొటీన్లు, కొవ్వులు వంటి స్థూల పోషకాలు () మాత్రమే సరిపోవు. వాటితో పాటు చాలా తక్కువ పరిమాణంలో అవసరమయ్యే విటమిన్లు, ఖనిజ లవణాలు కూడా అత్యంత కీలకం. వీటినే సూక్ష్మ పోషకాలుఅని పిలుస్తారు. ఇవి మన శరీరానికి నేరుగా శక్తిని ఇవ్వకపోయినా, జీవక్రియలు సజావుగా సాగడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, అవయవాల పనితీరులో కీలక పాత్ర పోషిస్తాయి. రోజువారీ ఆహారంలో మనం తీసుకునే పదార్థాల ద్వారానే వీటిని పొందగలం. మన ఆరోగ్యానికి అత్యవసరమైన కొన్ని ముఖ్యమైన సూక్ష్మ పోషకాలు, వాటి ఉపయోగాలు, అవి లభించే ఆహార పదార్థాల జాబితా ఇక్కడ ఉంది.

విటమిన్లు:
విటమిన్ ఎ: ఇది కంటి చూపును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుంది. రేచీకటి వంటి సమస్యలను నివారిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంచడంతో పాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడుతుంది. క్యారెట్లు, గుమ్మడికాయ, చిలగడదుంప, ఆకుకూరల్లో ఇది పుష్కలంగా లభిస్తుంది.
విటమిన్ బి12: శరీరంలో ఎర్ర రక్త కణాల తయారీకి, నరాల వ్యవస్థ పనితీరుకు ఇది చాలా అవసరం. డీఎన్ఏ సంశ్లేషణలోనూ దీనిది ముఖ్యమైన పాత్ర. శాకాహారులలో దీని లోపం ఎక్కువగా కనిపిస్తుంది. పాలు, గుడ్లు, చేపలు, మాంసం వంటి వాటిలో ఇది లభిస్తుంది.
ఫోలేట్ (విటమిన్ బి9): గర్భిణులకు ఇది అత్యంత ముఖ్యమైన విటమిన్. కణ విభజన, డీఎన్ఏ తయారీ, ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి ఫోలేట్ అవసరం. ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, శనగల్లో ఇది సమృద్ధిగా ఉంటుంది.
విటమిన్ సి: ఇది ఒక శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుంది. చర్మం, ఎముకలు, కండరాలను కలిపి ఉంచే కొల్లాజెన్ తయారీకి ఇది కీలకం. శరీరం ఐరన్‌ను గ్రహించడానికి కూడా సహాయపడుతుంది. ఉసిరి, జామ, నారింజ, నిమ్మ వంటి పండ్లలో ఇది అధికంగా ఉంటుంది.
విటమిన్ డి: 'సన్‌షైన్ విటమిన్' అని పిలిచే ఇది, శరీరం కాల్షియంను గ్రహించడానికి చాలా అవసరం. ఎముకలు, దంతాల పటిష్టతకు, కండరాల పనితీరుకు ఇది కీలకం. సూర్యరశ్మి ద్వారా శరీరం దీన్ని తయారు చేసుకుంటుంది. కొవ్వు ఉన్న చేపలు, గుడ్లలోనూ లభిస్తుంది.విటమిన్ ఇ: ఇది కూడా ఒక యాంటీఆక్సిడెంట్. శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ నష్టం నుంచి కాపాడుతుంది. చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. బాదం, వేరుశనగ, పొద్దుతిరుగుడు విత్తనాలలో ఇది ఎక్కువగా ఉంటుంది.విటమిన్ కె: రక్తం గడ్డకట్టే ప్రక్రియలో ఇది ప్రధాన పాత్ర పోషిస్తుంది. గాయాలు తగిలినప్పుడు అధిక రక్తస్రావాన్ని నివారిస్తుంది. ఎముకల ఆరోగ్యానికి కూడా ఇది చాలా అవసరం. ఆకుపచ్చని ఆకుకూరలు, బ్రోకలీలో విటమిన్ కె సమృద్ధిగా దొరుకుతుంది.

ఖనిజాల లవణాలు
ఐరన్: శరీరంలో హిమోగ్లోబిన్ తయారీకి ఐరన్ అత్యంత కీలకం. ఇది ఊపిరితిత్తుల నుంచి శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్‌ను రవాణా చేస్తుంది. దీని లోపం వల్ల రక్తహీనత వస్తుంది. ఆకుకూరలు, పప్పులు, మాంసం, బెల్లంలో ఇది అధికంగా లభిస్తుంది.
కాల్షియం: ఎముకలు, దంతాల నిర్మాణానికి, వాటి పటిష్ఠతకు కాల్షియం ప్రధాన ఆధారం. కండరాల సంకోచ వ్యాకోచాలకు, నరాల పనితీరుకు కూడా ఇది అవసరం. పాలు, పెరుగు, నువ్వులు, రాగి వంటి వాటిలో కాల్షియం పుష్కలంగా దొరుకుతుంది.
మెగ్నీషియం: శరీరంలో జరిగే వందలాది జీవక్రియలకు మెగ్నీషియం అవసరం. శక్తి ఉత్పత్తి, కండరాలు, నరాల పనితీరును నియంత్రిస్తుంది. గింజలు, విత్తనాలు, ఆకుకూరలలో ఇది సమృద్ధిగా ఉంటుంది.
జింక్: రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి జింక్ చాలా ముఖ్యం. గాయాలు త్వరగా మానడానికి, డీఎన్ఏ, ప్రొటీన్ల సంశ్లేషణకు సహాయపడుతుంది. పప్పులు, గింజలు, మాంసంలో జింక్ లభిస్తుంది.
అయోడిన్: థైరాయిడ్ గ్రంథి సరైన రీతిలో పనిచేయడానికి, థైరాయిడ్ హార్మోన్లను ఉత్పత్తి చేయడానికి అయోడిన్ అవసరం. అయోడైజ్డ్ ఉప్పు, సముద్రపు చేపలలో ఇది ఉంటుంది.
పొటాషియం: శరీరంలోని ద్రవాల సమతుల్యతను కాపాడటంలో, నరాల సంకేతాలను ప్రసారం చేయడంలో, కండరాల పనితీరులో ఇది సహాయపడుతుంది. అరటిపండు, బంగాళాదుంప, పప్పు ధాన్యాలలో ఇది ఎక్కువగా దొరుకుతుంది.
సెలీనియం: ఇది కూడా ఒక యాంటీఆక్సిడెంట్. థైరాయిడ్ పనితీరుకు, కణాలను నష్టం నుంచి కాపాడటానికి సహాయపడుతుంది. చేపలు, గుడ్లు, గింజలలో సెలీనియం లభిస్తుంది.
కాబట్టి, మన రోజువారీ ఆహారంలో రంగురంగుల పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, పప్పు ధాన్యాలు, గింజలు చేర్చుకోవడం ద్వారా ఈ సూక్ష్మ పోషకాలను తగినంతగా పొంది, సంపూర్ణ ఆరోగ్యంతో జీవించవచ్చు. ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తుంచుకోవాలి.

# మాంసాహారం తిన్నా విటమిన్ బీ12 లోపమా?

**దీర్ఘకాలిక మందులు, వయసు పైబడటం, గట్ సమస్యలు కూడా ఓ కారణమే**
**అలసట, నరాల బలహీనత, జ్ఞాపకశక్తి తగ్గడం వంటివి ప్రధాన లక్షణాలు**

విటమిన్ బీ12 లోపం అనగానే చాలామంది అది కేవలం శాకాహారులకు మాత్రమే వచ్చే సమస్యగా భావిస్తారు. కానీ అది పూర్తిగా వాస్తవం కాదు. రోజూ మాంసం, చేపలు, గుడ్లు, పాలు వంటివి తీసుకునే వారిలోనూ బీ12 లోపం తీవ్రంగా కనిపించవచ్చు. దీనికి ప్రధాన కారణం ఆహారం తీసుకోకపోవడం కాదు, తీసుకున్న ఆహారాన్ని శరీరం సరిగ్గా గ్రహించలేకపోవడమేనని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.విటమిన్ బీ12 ఎక్కువగా జంతు సంబంధిత ఆహారంలో లభిస్తుంది. శరీరం దీన్ని పెద్ద మొత్తంలో నిల్వ చేసుకుంటుంది




# నటులపై తీవ్ర ఒత్తిడి ఉంటోంది..

బాలీవుడ్ నటి ప్రీతి జింటా ప్రస్తుత నటీనటులు ఎదుర్కొంటున్న తీవ్ర ఒత్తిడిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పాపరాజీ సంస్కృతి, సోషల్ మీడియా ప్రభావంతో నటుల జీవితాల్లో వచ్చిన మార్పులను ఆమె వివరించారు. తన తాజా చిత్రం 'వైబ్' ప్రమోషన్ల నిమిత్తం ముంబైలో నిర్వహించిన ఓ ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలను వెల్లడించారు.గతంతో పోలిస్తే చిత్ర పరిశ్రమలో పరిస్థితులు సమూలంగా మారిపోయాయని ప్రీతి పేర్కొన్నారు. "గతంలో మేము షూటింగ్ పూర్తి చేసుకుని నేరుగా ఇంటికి వెళ్లేవాళ్లం. కానీ ఇప్పుడు ప్రతి అడుగుపై నిఘా ఉంటోంది. మేము ధరించే దుస్తుల నుంచి ఎయిర్‌పోర్ట్ లుక్స్ వరకు అన్నీ చర్చనీయాంశమవుతున్నాయి. మనసులో బాధ ఉన్నా, సంతోషంగా ఉన్నా, బహ్య ప్రపంచానికి ఫ్యాషన్ సెన్స్‌ను ప్రదర్శించాలనే అంచనాలు పెరిగాయి" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.అంతేకాకుండా, దేశంలో జరిగే ప్రతి ప్రధాన అంశంపైనా నటీనటులు కచ్చితంగా స్పందించాలనే ఒత్తిడి కూడా ఉంటోందని ప్రీతి అభిప్రాయపడ్డారు. వివాహం తర్వాత అమెరికాలో స్థిరపడిన ఆమె, తన కెరీర్‌లో 'క్యా కెహనా', 'సోల్జర్', 'సంఘర్ష్' వంటి వైవిధ్యభరితమైన చిత్రాలను ఎంచుకున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.



# నటనకు సమంత బ్రేక్



హైదరాబాద్: నటి, నిర్మాత సమంత కొంతకాలం పూర్తిగా నటనకు స్వస్తి చెప్పాలని భావించినట్లు తెలిపారు. ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత జీవితంలో మార్పుల కారణంగా ఈ నిర్ణయం తీసుకోవాలనిపించిందన్నారు. వైద్యుల సూచనతో వ్యాపార రంగంలో పెట్టుబడులు పెట్టి, వ్యాపారవేత్తగా జీవితాన్ని ఆస్వాదిస్తున్నట్లు చెప్పారు. 'సిటాడెల్' షూటింగ్ సమయంలో ఆరోగ్య సమస్యలతో ఇబ్బంది పడినా చిత్రబృందం ప్రోత్సాహంతో నటించానన్నారు. 'మా ఇంటి బంగారం' చిత్రంలోనూ రాజ్ ప్రోత్సాహంతో నటించినట్లు తెలిపారు. ట్రోలింగ్‌ను గతంలో మాదిరిగా ఇప్పుడు పట్టించుకోవడం లేదని సమంత పేర్కొన్నారు

# సంయుక్త మీనన్ బర్త్ డే టీజర్ విడుదల..



నిఖిల్ హీరోగా తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక పాన్ ఇండియా చిత్రం 'స్వయంభు' పై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో సంయుక్త, నభా నటేశ్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రం దాదాపు రెండేళ్లుగా షూటింగ్ జరుపుకుని ఇటీవలే చిత్రీకరణ పూర్తి చేసుకుంది. ఈ రోజు సంయుక్త మీనన్ బర్త్ డే సందర్భంగా 40 సెకన్ల టీజర్ విడుదల చేశారు. ఇందులో వీరనారి పాత్రలో సంయుక్త కనిపించిన తీరు, కత్తి యుద్ధాలు చేసిన విధానం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది.ఇప్పటివరకు గ్లామర్, ఎమోషనల్ పాత్రల్లో కనిపించిన సంయుక్త.. 'స్వయంభు'లో మాత్రం పూర్తి భిన్నమైన అవతారంలో కనిపించబోతున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. 'స్వయంభు' కథ చారిత్రక నేపథ్యంలో సాగనున్నట్లు టీజర్‌ను చూస్తే అర్థమవుతోంది.

# ప్రభాస్ 'ఫౌజీ' వాయిదా? 'స్పిరిట్' విడుదలపై పడనున్న ప్రభావం!



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న సినిమాల విడుదల తేదీలకు సంబంధించి సోషల్ మీడియాలో తాజాగా రకరకాల ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. హను రాఘవపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ' సినిమాను తొలుత డిసెంబర్ 3, 2026న విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేసిన సంగతి తెలిసిందే. అయితే షూటింగ్ మరియు పోస్ట్ ప్రొడక్షన్ పనుల ఆలస్యం కారణంగా ఈ చిత్రాన్ని 2027 మార్చికి వాయిదా వేసే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తుంది. దీనిపై చిత్ర యూనిట్ నుంచి ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.అయితే ఒకవేళ 'ఫౌజీ' విడుదల తేదీ మార్చికి మారితే, అది ప్రభాస్ ఇతర సినిమాల షెడ్యూల్‌పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో ప్రభాస్ నటించనున్న భారీ బడ్జెట్ సినిమా 'స్పిరిట్'ను మార్చి 5, 2027న విడుదల చేసేలా ఇదివరకే షెడ్యూల్ ప్రకటించారు. 'ఫౌజీ' డేట్ మారుతుందనే ప్రచారం నేపథ్యంలో 'స్పిరిట్' విడుదల కూడా వాయిదా పడుతుందనే టాక్ వినిపిస్తోంది.

# సౌత్ కొరియా సంస్థతో జతకట్టిన రష్మిక

స్టార్ హీరోయిన్ రష్మిక మందన యువతకు స్ఫూర్తినిచ్చే ఓ కొత్త కార్యక్రమంతో ముందుకొచ్చారు. ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కే-పాప్ గ్రూప్ బీటీఎస్ సహా ఎన్నో పాప్ గ్రూప్‌లను ప్రపంచానికి పరిచయం చేసిన దక్షిణ కొరియా వినోద సంస్థ 'హైబ్' (న్దీజు). ఈ సంస్థ భారతదేశంలో 'హైబ్ ఇండియా' పేరుతో ప్రతిభావంతుల అన్వేషణకు ఆడిషన్స్ నిర్వహిస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమానికి రష్మిక మందన భాగస్వామిగా వ్యవహరిస్తున్నారు.ఈ సందర్భంగా రష్మిక మాట్లాడుతూ.. తన ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. "ప్రతి ప్రయాణం ఒక అవకాశంతో, ఆ మొదటి అడుగు వేయడానికి కావలసిన ధైర్యంతో మొదలవుతుంది. నా జర్నీని వెనక్కి తిరిగి చూసుకుంటే, మనపై మనం నమ్మకం ఉంచడం, కష్టపడి పనిచేయడం, ఊహించని అవకాశాలకు సరేననడం ఎంత ముఖ్యమో నాకు తెలుసు" అని ఆమె పేర్కొన్నారు.భారత్‌లో ఇలాంటి అవకాశం రావడం ఇదే మొదటిసారని రష్మిక అభిప్రాయపడ్డారు. "ప్రపంచవ్యాప్తంగా ఎందరో గొప్ప కళాకారులను తీర్చిదిద్దిన హైబ్ సంస్థ, ఇప్పుడు భారతీయ యువతలోని ప్రతిభను గుర్తించడానికి ముందుకు రావడం ఆనందంగా ఉంది. దేశంలో ఎంతోమంది అమ్మాయిలు కళాకారులుగా, పెర్ఫార్మర్‌లుగా ఎదగాలని కలలు కంటారు. వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని



మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. ప్రతి ఒక్కరూ తమ కలకు ఒక అవకాశం ఇవ్వాలి" అంటూ యువతలో ఆమె స్ఫూర్తి నింపారు. హైబ్ సంస్థ బీటీఎస్‌తో పాటు టీఎక్స్‌టీ (౧శు), న్యూజీన్స్, ఇల్లిట్ వంటి ఎన్నో ప్రఖ్యాత కే-పాప్ గ్రూప్‌లను నిర్వహిస్తోంది.

# విభిన్న పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న రకుల్

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు.ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'లో రకుల్



శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది.

PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.